ఆదివారం
ప్రజాశక్తి
జనవరి 11, 2004

చందమామను అందుకుందాం

హ్యాపీ బర్త్‌డే

(11-1-2004నుండి 17-1-2004వరకు)

కె. సత్యచంద్ర అనిమిష
5సం॥, 11. 1. 1999
కళాజింబి-వరప్రసాద్
రామచంద్రపురం-తూర్పుగోదావరి

గుంతి కళ్యాణి
జనవరి-11
రంగనాయకమ్మ-సురేందర్
మాసాయిపేట-మెదక్

డి. మనీషా
5సం॥, 12.1.1999
అంజనమ్మ-చిన్నఅంజనేయులు
వనపర్తి-మ॥నగర్

కె. జాహ్నవి
జనవరి-11
శ్రీశైలం- కర్నూలు

ప్రదీప్‌కుమార్
9సం॥, 12-1-1995
మహాలక్ష్మి-పున్నారావు
తుళ్లూరు

డి. జాహ్నవి
2సం॥, 13. 1. 2002
శ్రీదేవి-శేషగిరి
పెన్నాడ-ప॥గో

మహేశ్వరి
చినతల్లి(చిన్న)-సురేష్
మాడుగుల

అబూబకర్ సిద్దిఖ్(బబ్బు)
2సం॥, 13. 1. 2002
ఎమ్‌డి రఫీ-అఫ్‌సరున్నీసా
పరకాల-వరంగల్

వేణుగోపాల్
జనవరి-13
కవిత-శంకర్రావు
చింతకాని-ఖమ్మం

చంద్రప్రకాశ్‌రెడ్డి
3సం॥, 14. 1. 2001
హరిత-రవిందర్‌రెడ్డి
అమరచింత-మ॥నగర్

భరత్ చంద్రప్రసాద్
జనవరి-14
వాణిశ్రీ-సురేందర్
మాసాయిపేట-మెదక్

ఎమ్.చంద్రమౌళి
7సం॥, 16.1.1997
పద్మావతి-తిరుపతిరావు
సింధియా స్టాఫ్ కాలనీ-విశాఖ

పి. సృజన
ప్రశాంతి-శ్రీనివాస్
రాంనగర్-హైదరాబాద్

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం



విజ్ఞానదాయకం

ఈ వారం కొత్త సంవత్సరం కవర్‌స్టోరీ ఆసక్తికరంగా సాగింది. నూతన సంవత్సర వేడుకలు అస్సలు ఎప్పట్నుంచి మొదలయ్యాయో అన్నదాని గురించి ఈ వ్యాసంలో చాలా చక్కగా వివరించారు. వివిధ దేశాల్లోను, మన దేశంలోను నూతన సంవత్సర వేడుకలు జరిగే పద్ధతులు, ఆనందోత్సాహాలతో ప్రజలు స్వాగతం పలికే తీరు విభిన్నంగా ఉన్నప్పటికీ భవిష్యత్తు ఆశాజనకంగా ఉండాలన్నదే అందరి సారాంశం. పాత సంవత్సరాన్ని వృద్ధుడితోనూ కొత్త సంవత్సరాన్ని చిన్నపిల్లవాడితోను పోలుస్తూ క్రైస్తవులు న్యూఇయర్‌కి స్వాగతం పలకటం భలే తమాషాగా ఉంది. కొత్త సంవత్సరంలో బాధ్యతల్ని పంచుకొని మంచి భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ శ్రమించవలసిన కనీస ధర్మం విస్మరించరానిది.

- మంకుశ్రీను, కొప్పర్రు.

అభినందనలు

డిసెంబర్ 28వ తేదీ సంచికలో ప్రచురించిన 'కోటి ఆశలు రేకెత్తిస్తూ వస్తోంది కొత్త సంవత్సరం' కవర్ పేజీ కథనం చాలా బాగుంది. నూతన సంవత్సరం గూర్చి, వివిధ దేశాల సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను

క్లుప్తంగా తెలియజేసింది. అందుకు కృతజ్ఞతలు. నూతన సంవత్సర వేడుకలు ఏ దేశంలో ఏ విధంగా జరుపుకుంటున్నా అందరి ఆశా, ఆశయం ఒకటే. 28 డిసెంబర్ ఆదివారం అనుబంధంలో కళాసాహితి శీర్షికన ప్రచురించిన మహానట కంఠీరవ రాజ్‌కుమార్ 2002 సంవత్సరానికి గాను శ్రీకన్నడ కంఠీరవ రాజ్‌కుమార్‌కు ఎన్‌టిఆర్ అవార్డు ప్రకటించడం అవార్డుకే గర్వకారణంగా ఉంది.

- మేడూరి సత్యనారాయణ,
తిరువూరు, కృష్ణాజిల్లా

అందరికీ ఆదర్శం

ఈ వారం రియల్‌స్టోరీ వెలుగుదివ్వె కదిలించింది. అంధురాలైన సుధాపాటిల్ మొక్కవోని ఆత్మవిశ్వాసంతో హిందీలో పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేయటం గొప్ప విషయమైతే అతి పిన్న వయస్సులో గ్రామ సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి విశేష కృషి చేయటం, కేంద్రం ఆమె సేవలను గుర్తించటం ఆపై హవాయి ప్రభుత్వం అవార్డుతో ఏభై లక్షలు ఆమెకు ఇవ్వటం అరుదైన సన్నివేశం. అంధురాలైనప్పటికీ అంకిత భావంతో అభివృద్ధే ధ్యేయంగా పని చేసిన సుధాపాటిల్ ఈతరం రాజకీయ నాయకులకు ఎంతైనా ఆదర్శం.

- షేక్ ఆలీవలి, మొగల్తూరు.

కథ బాగుంది

28-12-2003వ తేదీన ప్రజాశక్తి ఆదివారంలో ప్రచురించిన మూడో చేప కథ బాగుంది. ఈ రోజుల్లో చదువులకు, ఉపాధికి పొంతన లేకుండా పోయింది. పూర్వం బ్రతకలేక బడిపంతులు అయ్యే వారు అనే వారు. ఈ రోజుల్లో బ్రతకనేర్చిన వారు రాజకీయ నాయకులవుతున్నారు. రచయిత అభినందనీయులు.

- వైదా ఈశ్వరరావు, మిండి.

ఆలోచింప చేసిన కథ

డిసెంబర్ 28 నాటి ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో 'మూడోచేప కథ' నేటి అస్తవ్యస్త విద్యావిధానాన్ని, నిరుద్యోగులు ఎలా ప్రభుత్వ గాలానికి చిక్కుకుంటున్నది చక్కగా తెలియచేస్తూ ఆలోచింపచేసింది. నిజంగా నేటి నిరుద్యోగ విద్యార్థి చేపలా విలవిలలాడుతున్నాడు. మంచి కథలు ప్రజాశక్తిలో చదవగలుగుతున్నందుకు ఆనందంగా వుంది.

- బి. కిరణ్ కుమార్,. మద్రిపాలెం,
విశాఖపట్నం.

కృతజ్ఞతలు

28వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన మూడో చేప కథ బాగుంది. బాలనేస్తాలు ఫైల్ చేసుకోవడానికి వీలుగా మధ్య పేజీలో వేస్తున్నందుకు కృతజ్ఞతలు. రుచిలో వంటకాలు రుచిగావున్నాయి. అలాగే 21వ తేదీ సంచికలో ప్రచురించిన 'ఔరా' విషయాలు ఆసక్తిగా వున్నాయి. దేవానంద్ ఆర్టికల్ బాగుంది.

- పి.ఎస్.ఎస్. కిరణ్, మాణికేశ్వరనగర్,
హైదరాబాద్.

మనలో మాట

నాకేంటి?

ప్రజాసేవయే మా కర్తవ్యం - ఈ మాట ప్రభుత్వరంగ సంస్థలకు పెట్టుబడి! ప్రజల సేవలోనే తరిస్తాం - ఈ పలుకు రాజకీయానికి మొక్కుబడి! రెండూ మంచి మాటలే! బంగారం లాటి పలుకులు! ఆణిముత్యాల్లాటి ముక్కలు!

ఈ సుభాషితాలు సవ్యంగా అమల్లో వున్నప్పుడు - సామాన్యుడు సుఖంగా బతగ్గలుగుతాడు! ఇవి కేవలం చిలక పలుకులు మాదిరి మారినప్పుడు అతను గంటల బతుక్కి అంకితమవుతాడు. దగా పడిన తమ్ముడిగా స్థిరపడతాడు!

ఆర్యులు అందుకే అన్నారు -

పెట్టుబడి మొక్కుబడుల కంటే మంచి మాటకి 'కట్టుబడి' వుంటే లోకకళ్యాణం జరుగుతుందని!

ధర్మసూత్రాలు పెద్ద సంఖ్యలోనే వుంటాయి!

ఎక్కాల పుస్తకాల్లో కూడా లెక్కకు మించి అచ్చవుతుంటాయి. ఆ సూత్రాలు అక్షరాలకే పరిమితమవుతాయి. ఆచరణ విషయానికొస్తే ఆలోచనలో పడతాయి!

నాకేంటి -

అనే పదం చాలా విరివిగా వినిపిస్తున్న ఈ దిక్కుమాలిన రోజుల్లో - పెట్టుబళ్లూ మొక్కుబళ్ళూ సమస్తం గాలికి కొట్టుకుపోతున్నాయి. కట్టుబళ్ళు కేవలం 'నాకేంటి' అనే సూత్రమ్మీదే బతుకుతున్నాయి!

అందువల్ల -

మన ప్రగతి రథం 'నాకేంటి' అనేదారిలో చాలా వేగంగా పరుగెడుతోంది!

సత్యం గారిల్లెక్కడ అని మీరు నన్ను అడిగేరు!

చెబితే 'నాకేంటి' అని నేను మిమ్మల్ని అడిగేను!

ప్రస్తుతం

ఈ నాకేంటితోనే వ్యవహారాలు నడుస్తున్నాయి! మీరడిగిన సత్యం గారిల్లు ఎక్కడో చెప్పడానికి నేను వెర్రివెంగళప్పను కాను!

ఫ్రీగా చెప్పి మీ వెతుకులాట కష్టానికి తెర దించేస్తే నాకేమిటి లాభం? లెఫ్టుకి వెళ్ళి మూడో రైటు సందు తిరిగితే రైటున వున్న మూడో బాదం చెట్టు ఇల్లేనని కరెక్టు అడ్రస్సు చెబితే - నాకు ఒరిగేదేమిటి? సొంత లాభం ఎంతో కొంత లేకపోతే - నేను నోరెందుకు విప్పుతాను?

సమస్య సత్యం గారిల్లెక్కడ కావచ్చు! త్వమేవాహమ్ అంటే మీనింగేమిటో చెప్పమనచ్చు! కరెక్టు ఆన్సర్లు నా దగ్గిర సిద్ధంగానే వున్నాయి!

నాకేంటో తెలీకుండా నేను ఫ్రీగా నోరు విప్పను!

ఈ సిద్ధాంతాన్ని నేను ఒక కామెడీ సినీమాలో రాసుకున్నాను. ఆ సినీమా రెండు వందలు పండగ జేసుకుంది!

మనం ప్రభుత్వ ఉద్యోగులం. అనగా ప్రజాసేవకులం. మనకి చేతనైన సేవ ప్రజలకు అందించాలి!

రిటైరైన ఉద్యోగికి రావలసిన మొత్తాన్ని - నాకేంటి అని ప్రశ్నించకుండా - రిటైరైన ఆసామి చేతిలో పెడితే - అదిక్లాసు వన్ ప్రజాసేవ!

నాకేంటి అని అడక్కుండా - అల్పజీవులకు న్యాయబద్ధంగా ఫైళ్ళు రాసి - వారిని, ఆదుకుంటే అది అద్భుత సేవ!

ఇంత మహత్తరమైన సేవలకు నీళ్ళొదిలి - 'గిట్టుబాటు' కావడం లేదనే సాకుతో - ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామా చేసి రాజకీయంలోకి దూకేవాళ్ళని చూచి నేను జాలి పడతాను!

నాకేంటి అనబడే సిద్ధాంతాన్ని కళాత్మకంగా పోషించి తరించాలనే వాళ్ళ తపన అర్థం చేసుకుని - ఈ దేశం ఎటుపోతుందోనని నన్ను నేనే ప్రశ్నించుకుంటాను.

సెలవు!

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం...	. . . 4
ఓరా!	. . . 5
కవర్ స్టోరీ	. . . 6
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
జీవనశైలి	. . . 15
ఇంతిసంగతులు	. . . 16
కచేరి	. . . 17
ఆరోగ్యం	. . . 18
పుస్తక పరిచయం	. . . 20
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...

జీవితం
కథ ... 9

రోసా లగ్జెంబర్గ్
రియల్‌స్టోరీ... 14

ఆలయాల జిల్లా మహబూబ్‌నగర్
టూరిస్ట్ గైడ్ . . . 21

హిందీచిత్రరంగ స్వరకర్త సి.రామచంద్ర
కళాసాహితి
. . . 22

SPEAK ENGLISH FLUENTLY

తెలుగు తెలిస్తే చాలు...

మీరు ఇంట్లోనే ఉండి సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి!

5 లక్షలమందికి పైగా నేర్చుకున్న ఇంగ్లీష్ కోర్సు మరి మీరూ...

స్టూడెంట్ అభిప్రాయం

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ ఫ్లూయెంట్‌గా మాట్లాడలేకపోయేవాడిని. నాకు ఒక మిత్రుని సలహా లభించి కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ తెప్పించి చదివాను. కేవలం ఒక్క నెలరోజుల్లోనే చక్కగా ఇంగ్లీష్ మాట్లాడగలుగుతున్నాను.

— జె.వి.రావు, విజయవాడ.

ఈ కోర్స్‌తో 25 గిఫ్ట్ పుస్తకాలు ఉచితం!

1. హిందీ స్పీకింగ్ కోర్సు 2. తమిళ్ స్పీకింగ్ కోర్సు 3. కన్నడ స్పీకింగ్ కోర్సు 4. మలయాళం స్పీకింగ్ కోర్సు 5. బెంగాలీ స్పీకింగ్ కోర్సు 6. మరాఠీ స్పీకింగ్ కోర్సు 7. పంజాబీ స్పీకింగ్ కోర్సు 8. గుజరాతీ స్పీకింగ్ కోర్సు 9. అరబిక్ స్పీకింగ్ కోర్సు 10. ఉర్దూ స్పీకింగ్ కోర్సు 11. ఒరియా స్పీకింగ్ కోర్సు 12. సాన్‌స్క్రిట్ స్పీకింగ్ కోర్సు. (12 ఇన్ 1 పాకెట్ సైజులో) 1. ఇంగ్లీష్ డిక్షనరీ 2. వర్డ్ పవర్ 3. లెటర్ రైటింగ్ ప్రాక్టీస్ 4. వెర్బ్స్ డిక్షనరీ 5. సినానిమ్ & యాంటోనిమ్స్ డిక్షనరీ. (5 ఇన్ 1 పాకెట్ సైజులో) 1. ఈజీ మనీ ఎర్నింగ్ కోర్సు. 2. సీక్రెట్ మ్యాజిక్ కోర్సు. 3. జెంట్స్ స్మార్ట్‌నెస్ కోర్సు. 4. బ్యూటీ ట్రీట్‌మెంట్ కోర్సు. 5. సక్సెస్‌ఫుల్ ఎగ్జామినేషన్ కోర్సు. 6. యోగా కోర్సు. 7. పా 'మిస్టరీ' కోర్సు. 8. కిచెన్ ట్రీట్‌మెంట్ కోర్సు. (8 ఇన్ 1 పాకెట్ సైజులో) *ఈ ఇంగ్లీష్ కోర్స్ తర్వాత మరో నాలుగు నెలల కోర్సు కూడా ఉంది. ఈ కోర్సులు నియమిత నామమాత్రపు ఫీజుతో పంపుతాము. మీరు కావాలనుకుంటే పొందవచ్చు. తప్పకుండా తీసుకోవాలన్న నిబంధన లేదు.

కొత్త సంవత్సర కానుక



ఈ కూపన్ పంపండి.

K.V.R. B.Com.,B.L., (Director)

KVR INSTITUTE

Award Winner

2746

No.76, Habibullah Road, T.Nagar, Chennai - 17. Ph: 044-56107404.

నాకు కె.వి.ఆర్. ఒక నెల ఇంగ్లీష్‌కోర్స్, కొత్త సంవత్సర కానుక ఉచిత డైరీ మరియు 25 గిఫ్ట్‌పుస్తకాలు వి.పి.పి. లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.200/-లు పైకం చెల్లించి తీసుకుంటాను.

(మీ చిరునామా స్పష్టంగా అర్థమయ్యేలా ఇంగ్లీష్‌లో వ్రాయండి. లేనిచో కోర్స్‌ను పంపుటకు వీలుపడదు)

Name: ....

Address: ....

....

.... Pin Code: ☐☐☐☐☐☐

DIRECT COACHING CENTRES: ● CHENNAI: 56107404. ● NELLORE: 2342347.

కార్టూన్ కదంబం


నారు


భాగస్వామ్య సదస్సు
హైదరాబాద్
పెట్టుబడులు


శ్వేత పత్రం
ప్రగతి నివేదిక


సిట్టింగ్ ఎమ్మెల్యేనే సార్, పార్టీ టికెట్ కోసం తటస్థుడిగా మారానంటున్నాడు
తటస్థులకు : టికెట్లు : బాబు

ఔరా!

గ్రామీణపత్రిక

వార్తాపత్రికలు పట్నవాసం తప్ప గ్రామీణ ప్రజల కష్టనష్టాల గురించి పట్టించుకోవడంలేదని ఎప్పటినుండో విమర్శలున్నాయి. దేశంలోని మెజారిటీ పత్రికలు కార్పొరేట్ సంస్థలవే కావడం వల్ల ఈవిధంగా జరుగుతోంది. ఈ పరిస్థితి ఒకటి ఆరా మినహా దేశవ్యాప్తంగా అన్ని పత్రికల్లో, అన్ని రాష్ట్రాల్లోనూ ఉంది. గ్రామాల పట్ల ఈ వివక్షకు నిరసనగా ఒరిస్సాలోని కొందరు మేధావులు ఏకంగా ఒక గ్రామీణపత్రికనే నెలకొల్పారు. ఒరిస్సా రాజధాని భువనేశ్వర్ శివార్లలో గల గోపీనాథ్‌పూర్ అనే గ్రామంలోని 60 మంది కలిసి కేవలం గ్రామీణ వార్తల కోసం, గ్రామీణ ప్రాంతాల్లోనే పంపిణీ చేసే నిమిత్తం జనవాణి పేరుతో ఒక దినపత్రికను స్థాపించారు. నూతన సంవత్సరం ప్రారంభ దినాన దీనికి శుభారంభం పలికారు. నాలుగు పేజీలతో ఒక రూపాయి ధర పెట్టి పత్రికను నడుపుతున్నారు. రాష్ట్రంలోని 50వేల గ్రామాలకూ పత్రికను చేర్చాలన్నది వారి ప్రయత్నం. కమ్యూనికేషన్ రంగంలో అనుభవం గల ఒక రిటైర్డ్ ఐఎఎస్ అధికారి నేతృత్వాన గ్రామీణ యువకులకు పత్రికా వార్తలు సేకరించడం గురించి శిక్షణ ఇస్తున్నారు. జనవాణి ఛారిటబుల్ ట్రస్ట్ పేరిట ఒక సంస్థను స్థాపించి ఎంతో పట్టుదలతో వారు పత్రికను నడుపుతున్నారు. గ్రామసీమల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడమే తమ లక్ష్యమని వారు చెబుతున్నారు. ఇది మంచి ప్రయత్నమే కదా?!



ఔరా ఏమి ఈ భారతం !! ?...

మొన్నీ మధ్యన పాకిస్తాన్ నుండి ఓ రైతు ప్రతినిధి బృందం న్యూఢిల్లీని సందర్శించింది. దేశ రాజధాని ఢిల్లీలో కార్లు, బైకులు నడుపుతున్న మహిళలను చూసి వారు నోరెళ్ళబెట్టారంట! ఇంకోరోజు రోడ్లు మీద సిగరెట్లు తాగుతున్న, బార్లలో మద్యం సేవిస్తున్న 'ఆధునిక' మహిళలను చూసి మూర్ఛపోయినంత పనిచేశారట! పరమ సనాతన భూస్వామ్యవర్గానికి ప్రతినిధులైన ఆ రైతు బృందం ఈ వింతలేమీ తమ దేశంలో లేవని సెలవిచ్చారట! భారత్-పాకిస్తాన్ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారం, అలవాట్లు ఒకేరకంగా ఉంటాయని విన్నాం, కాని మా దేశంలో కార్లు, బైకులు మహిళలు నడపరు. పోనీ అనుకుంటే సిగరెట్లు, మద్యం తాగడమేమిటి? మా దేశంలో మహిళలు ఇలాంటి వారు కాదు.. ఇదేంటి భారతదేశం ఇలా ఉంది అని అనుకున్నారట పాపం!?. పాశ్చాత్య సంస్కృతి అంటించిన అంటువ్యాధే ఈ సిగరెట్లు, మద్యం వంటి దురలవాట్లు అని వారికి తెలియదు కాబోలు?

పాపం శాంతాక్లాజ్

షాపర్స్‌స్టాప్.. ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉండే పెద్ద రిటైల్‌షాప్. దీనికి దేశవ్యాప్తంగా బ్రాంచీలు ఉన్నాయి. క్రిస్మస్ సందర్భంగా ముంబాయి శివార్లలోని షోరూమ్ శాంతాక్లాజ్‌ను ఏర్పాటుచేసి వ్యాపారం పెంచుకుందామని అనుకుంది. క్రిస్మస్ రోజున తల్లిదండ్రులతో షాపింగ్‌కు వచ్చే పిల్లలకు శాంతాక్లాజ్ బహుమతులిస్తాడని పెద్ద ప్రచారం చేసిందట. ఇంకేం దాదాపు రెండు వేలమంది పిల్లలు, పెద్దలు షోరూమ్‌పై దాడి చేశారట. అందర్నీ లైనులో నిలబడమని చెప్పినా వినకుండా శాంతాక్లాజ్ వద్దగల సంచిలోని బహుమతులు లాక్కోవడానికి మీదపడ్డారట. మొత్తం మీద శాంతాక్లాజ్‌ను లూటీచేశారు. పాపం ఆ వేషధారి బ్రతుకుజీవుడా అనుకుంటూ తన వద్ద బహుమతుల సంచీని అక్కడే వదిలేసి పరారయ్యాడట. అయినా గాని అతను అక్కడే ఉన్నాడేమోనని, ఇంకా బహుమతులు ఉన్నాయేమోనని పరిసరాల్లోని చెట్టూ, పుట్టా, రోడ్లన్నీ శాంతాక్లాజ్ కోసం వెతికారట?! పాపం శాంతాక్లాజ్!



* సరిత.ఎస్

చందమామను అందుకుందాం...

చందమామ రావే..జాబిల్లి రావే..కొండెక్కి రావే.,
రావోయి చందమామా, మా గాథ వినుమా.. నిన్నటి పాటలు..
అద్దంలో జాబిలిని చూసి మురిసిపోయే రోజులు పోయాయి. నిన్నే చేరుకుంటాం..
నీ అసాంతం పరిశీలిస్తాం..
నీ దగ్గరే ఉండిపోతాం..అనేది నేటి పాట.
చందమామ గురించి ఆసాంతం ఇంకా అంతుపట్టలేదు..
అయినా అపుడే చంద్రునిపై మూడవ వంతు స్థలాన్ని అమ్మేశారు. దాదాపు 180 దేశాల ధనికులు కొనేశారు. ఆశ్యర్యపోతున్నారా?
ప్రతిదాన్ని డబ్బుతో చూసే అమెరికా కంపెనీలు కొన్ని చంద్రునిపై స్థలాన్ని ప్లాట్లుగా విభజించి అమ్ముకుంటున్నాయి. కొన్ని కంపెనీలు చంద్రునిపై పిక్‌నిక్‌లు, హనీమూన్ ఏర్పాట్లు చేస్తున్నామని ప్రకటిస్తున్నాయి..

పురాతన కాలం నుండి మనిషిని చంద్రుడు అలరిస్తున్నాడు. బాధను, ఆనందాన్ని చంద'మామ'తో పంచుకుంటున్నాడు. విశ్వాంతరాలను శోధిస్తున్న మనిషి తన వెన్నెల 'నెలరాజు' దగ్గరకు వెళ్లి చాలా కాలమైంది. శతాబ్దాలుగా మనిషి చంద్రుడ్ని ఆరాధిస్తున్నాడు. దాన్ని అందుకుని తీరాల్సిందేనని పట్టుపట్టాడు. 'అంతరిక్షం ఒక సముద్రమైతే, చంద్రుడు మాకు దగ్గరలోని దీవి' అని అభివర్ణించాడు. చంద్రునిపై ఆసక్తి చాలా వేల ఏళ్లకిందటే ఎలా మొదలైంది. క్రీస్తుపూర్వం 460-370 సంవత్సరాలనాడే చంద్రునిపై పర్వతాలు ఉన్నాయని మనిషి ఊహించాడు. అయితే ఈ ఊహలు తప్పుగా ఉన్నప్పటికీ ఇది పెద్ద సంచలనం కలిగించింది. క్రీస్తుపూర్వం 260కల్లా చంద్రుని, భూమి మధ్య దూరాన్ని కనుగొనడానికి కొన్ని పద్దతులు కనుగొన్నారు.



తర్వాత పలువురు శాస్త్రవేత్తల రకరకాల అంశాలు కనుగొన్నప్పటికీ భారత్ దేశానికి చెందిన ఆర్యభట్ట 1 చంద్రుని సైజు, దూరాన్ని కనిపెట్టారు. 1610లో గెలీలియో తొలిసారిగా టెలిస్కోపిక్ చంద్రుని చిత్రపటాన్ని తీశారు. 1665లో రాబర్ట్ హుక్ చంద్రునిపై క్రేటర్లు ఉంటాయని గుర్తించారు. 1680లో కాసినో గీసిన చంద్రుని మ్యాప్ 17వ శతాబ్దంలో బెస్ట్ మ్యాప్ అని చెప్పవచ్చు. సోవియట్ యూనియన్ స్పుత్నిక్‌తో అంతరిక్ష పరిశోధనలకు నాంది పలికింది. ప్రచ్ఛన్నయుద్ధసమయంలో రెండు అగ్రరాజ్యాలైన సోవియట్, అమెరికా అంతరిక్ష పరిశోధనల్లో పోటీపడ్డాయి. అంతరిక్షంలో వెళ్లి పరిశోధనలు జరపాలన్న మానవుడి కృషి సోవియట్ యూనియన్ స్పుత్నిక్ ద్వారానే సాధ్యమైంది.

స్పుత్నిక్ ప్రవేశపెట్టగానే అమెరికా భయంతో వణికిపోయింది. అప్పటివరకు అంతరిక్ష పరిశోధనలపై అమెరికా అధ్యక్షులు సైనికాంశాల్ని పట్టించుకున్నంతగా అంత సీరియస్‌గా పట్టించుకోలేదు. దానికి తోడు అమెరికా మొదటి ఉపగ్రహం పేలిపోవడం దానికి అవమానకరంగా తోచింది. సోవియట్‌తో ఎలాగైనా పోటీ పడాలని అమెరికా నిర్ణయించుకుంది. తర్వాత

1957-58వ సంవత్సరంలోనే భూమి, దాని పరిసరాలపై పరిశోధనలకు అమెరికా, సోవియట్ చేస్తున్న శోధనలు చంద్రునివైపుకు మళ్లాయి. 1959లో ల్యూనా-1 ద్వారా చంద్రునికి 46,660 మైళ్ల దూరం వరకు వెళ్లి మరో సంచలనానికి తెరతీసింది. తర్వాతి ల్యూనా-2 కూడా చంద్రుని ఉపరితలంవైపుకు వెళ్లి పెద్దహిట్ సాధించింది. అదే ఏడాది ల్యూనా-3 చంద్రుని అవలివైపు ఫోటోలు తీసింది. సోవియట్ వరుస విజయాలు అమెరికాను నిలువనీయలేదు. 1964లో మానవరహిత స్పేస్‌క్రాఫ్ట్ రేంజర్-7 పంపింది. సోవియట్ ల్యూనా-9 చంద్రునిపై సురక్షితంగా ల్యాండ్ అయింది. 1970 వరకు అమెరికా, సోవియట్ వరుసగా చంద్రునిపై అధ్యయనానికి అంతరిక్ష ప్రయాణాలు చేశాయి. 'మనిషి ఒక చిన్న అడుగు- మానవజాతి చరిత్రలో ఒక పెద్ద అంగ' అని నీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్ తొలిసారిగా అపోలో-2 ద్వారా చంద్రునిపై అడుగుపెట్టి వచ్చిన తర్వాత తొలి మాట అది. ఇది జరిగి 35సంవత్సరాలు దాటింది. చంద్రమండల పరిశోధనల్లో అగ్రస్థానం సోవియట్‌దే. అంతరిక్ష పరిశోధనా విజయాల్లో సోవియట్ యూనియన్‌ను ఎవరూ ఆపలేకపోయారు. తర్వాత చాలా మంది అసాధ్యం అనుకున్న దాన్ని అమెరికా సుసాధ్యం చేసింది. చంద్రమండలానికి మనిషిని పంపాలన్న యోచన అపోలో-2 వెళ్లడానికి 15సంవత్సరాల ముందే ప్రారంభమైంది. సోవియట్

అమెరికా ఇంటెలిజెన్స్, అంతరిక్ష పరిశోధనా విభాగ చీఫ్‌లు రహస్యంగా ఓ నిర్ణయం తీసుకున్నారు. అదే చంద్రునిపై తొలుత తామే అడుగుపెట్టాలని. కెన్నడీ అధ్యక్షుడు అయిన తర్వాత అంతరిక్ష పోటీని తీవ్రంగా పరిగణించారు. 1961మేలో కెన్నడీ చంద్రమండల యాత్ర ప్రతిపాదన ఉన్నట్లు ప్రకటించారు.

తాజాప్రయత్నాలు

చంద్రునిపైకి వెళ్లడానికి పలు దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. చైనా, జపాన్, భారత్, యూరప్ చందమామపై అమితాసక్తి కనపరుస్తున్నాయి. చంద్రునిపై తమ పాదముద్రలు వేయాలని, తమ దేశజెండాలు పాతాలని ఆయా దేశాలు తహతహలాడుతున్నాయి. అపోలో తరహా మరో మిషన్‌కు అమెరికా మరోసారి యోచిస్తోంది. అన్ని దేశాలను చంద్రుడు అయస్కాంతంలా ఆకర్షిస్తున్నాడు. రాబోయే దశాబ్దాల్లో చంద్రుడు, అంగారకుడు పలుదేశాలకు గమ్యస్థానాలుగా మారుతాయనడంలో సందేహం లేదు. యూరప్ అరోరా ప్రోగ్రామ్ చాలా వేగంగా పూర్తి చేస్తోంది. జపాన్‌కు చెందిన ల్యూనా-ఎ ప్రాజెక్టు శరవేగంతో తయారవుతోంది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ స్మార్ట్-1కూడా ఇదే దశలో ఉంది. వచ్చే పదేళ్లలో పలు స్పేస్ ఏజెన్సీలు చంద్రుడి ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం అవుతాయి. ఈ ఏడాది ప్రయోగించేందుకు జపాన్ ల్యూనా-ఎ స్పేస్‌క్రాఫ్ట్‌ను సిద్ధం చేస్తోంది. గత ఏడాది నవంబర్ 16-22మధ్య హవాయ్‌లో అంతర్జాతీయ ల్యూనార్ ఎక్స్‌ప్లోరేషన్ వర్కింగ్ గ్రూప్ సమావేశంలో పలు దేశాలు పాల్గొన్నాయి. చంద్రునిపై నీటివనరులు లేదా మంచుగడ్డలు మానవుడికి ఉపయోగపడతాయా, ఆస్ట్రో ఫిజికల్ అబ్జర్వేటరీల ద్వారా ఇంధన వనరుల తయారీ సాధ్యమవుతుందా, మనిషి ఉండటానికి అక్కడి వాతావరణాన్ని ఎలా అధిగమించవచ్చు వంటి అంశాలను పరిశోధించాలని ఆ దేశాలు ఏకగ్రీవంగా నిర్ణయించాయి. ల్యూనా ఎ ద్వారా చంద్రునిలోని అంతర్గత అంశాలను పరిశీలించనున్నట్లు జపాన్ ప్రకటించింది. అమెరికా అపోలో తర్వాత జపాన్‌దే పెద్ద ప్రాజెక్టు. దీని ద్వారా చంద్రుని పరిమాణం, అంతర్గత పరిశోధనలు నిర్వహించేందుకు ల్యూనా-ఎ ద్వారా జపాన్ ప్రయత్నిస్తోంది. సెలెన్ ప్రాజెక్టు నుండి చంద్రుని పైకి టెలివిజన్ ఎక్విప్‌మెంట్ తీసుకెళ్ళి పూర్తిగా అధ్యయనం చేస్తుంది. సెలెన్-బి మిషన్ 2010 మధ్యలో ప్రారంభమవుతుంది.

చంద్రునిపైకి 2020 నాటికి మనిషిని పంపాలని చైనా ప్రణాళిక సిద్ధం చేసుకుంది. 2007కల్లా ఉపగ్రహకక్ష్యను ప్రవేశపెట్టాలని, 2010కల్లా మానవరహిత రాకెట్‌ను పంపాలని చైనా నిర్ణయించింది. గత అక్టోబర్ 15న యాంగ్ లియూ అనే వ్యక్తిని తొలిసారిగా అంతరిక్షంలోకి పంపి చైనా తానేమీ వెనుకబడలేదని రుజువు చేసుకుంది. అయితే అత్యంత భారీ ప్రాజెక్టులైన ఈ అంతరిక్షయానంపై ఇంకా ఊహాగానాలు వెలువడుతూనే ఉన్నాయి. 1970లో చైనా తొలిసారి ఉపగ్రహాన్ని ప్రయోగించింది. అంతరిక్ష పరిశోధన చైనాకు ప్రతిష్టాత్మక ప్రాజెక్టు. శాశ్వత స్పేస్‌స్టేషన్ కోసం కూడా చైనా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. గత 40 ఏళ్ళుగా రష్యా, అమెరికా అంతరిక్ష అనుభవాల నుండే చైనా పాఠాలు నేర్చుకుంది. చైనా తయారుచేసిన షెన్‌ఝూయ్ క్యాప్సూల్ రష్యా, అమెరికాలు అంతరిక్షంలోకి పంపిన వాటికంటే ఉత్తమమైనది. యూరిగగారిన్ గంటా 48నిమిషాలు అంతరిక్షంలో ఉంటే అమెరికాన్ అలాన్‌షెపార్డ్ 15నిమిషాలే ఉండగా, యాంగ్ 22గంటలు ఉన్నాడు. అంతరిక్షంలో ఇటీవల చైనా విజయంతో ఆ దేశ మూడంచెల కార్యక్రమానికి మరింత ఊపునిస్తోంది. చైనా ఛేంజ్ ఇ ఐ కార్యక్రమంపై విస్తృత స్థాయి చర్చలు జరుగుతున్నాయి. 2006నుండి 2015 మధ్యలో చంద్రయానంపై దృష్టి పెడతామని చైనా ప్రకటించింది. చంద్రుని కక్ష్యలో తిరగడం, దానిపైకి వెళ్లడం, అక్కడ నుండి శాంపిల్స్ తీసుకురావడం చైనా ప్రాజెక్టులో ఉన్నాయి. మొదటి మిషన్ 2006లో జరుగుతుందని తెలిపింది. చంద్రునిపైకి మనిషిని పంపేందుకు యూరప్ శరవేగంతో కృషి చేస్తోంది. సెప్టెంబర్ 27న స్మార్ట్-1 కార్యక్రమాన్ని యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ప్రారంభించింది. 15 నెలల తర్వాత ఇది చంద్రమండల కక్ష్యలోకి అడుగుపెడుతుంది. 2020-25కల్లా ఇవన్నీ అరోరా కార్యక్రమం ద్వారా మనిషిని పంపాలని యూరోప్ నిర్ణయించింది. చంద్రునిపై ఉన్న మంచుగడ్డలే ప్రస్తుతం చర్చనీయాంశం. అమెరికా క్లెమెంటైన్ స్పేస్‌క్రాఫ్ట్, ల్యూనార్ ప్రాజెక్టులు చంద్రునిపై మంచుగడ్డలు ఉన్నాయని ధృవీకరించాయి. వాటితో పాటు హైడ్రోజన్ ఉండటం కూడా మానవ మనుగడపై ఆశ కలిగిస్తోంది. ఈ డిపాజిట్లు గల్ఫ్ చమురు క్షేత్రాల వంటి గనులని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.



భారీ బడ్జెట్

చంద్రమండలంపైకి మనిషితో కూడిన స్పేస్‌క్రాఫ్ట్‌ను పంపడం అంటే అత్యంత వ్యయమయ్యే ప్రాజెక్టు. ఈ వ్యయంతో ఇక్కడి ప్రజల ఆకలి, వైద్యం వంటి సమస్యలను తీర్చడం ఉత్తమమని పలువురు మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అపోలో నౌకకు అమెరికా భారీగా ఖర్చు చేసింది. అపోలో తర్వాత నాసా బడ్జెట్ 50శాతం తగ్గిపోయింది. 1966లో 5.5బిలియన్ డాలర్లు ఉన్న నాసా బడ్జెట్ ఇప్పుడు 13.8బిలియన్ డాలర్లకే పెరగటం గమనార్హం. చైనా, జపాన్‌లోనూ ఇలాంటి వాదనలే వస్తున్నాయి. ఆయా ప్రభుత్వాలు అంతరిక్ష శోధనలను ప్రెస్టేజి ప్రాజెక్టులుగా భావిస్తున్నాయి.

చందమామనూ అమ్మేస్తున్నారు

ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు చంద్రునిపైకి వెళ్లేందుకు అమెరికా ప్రభుత్వం అనుమతినిచ్చింది. అమెరికా ప్రభుత్వం నుండి అనుమతి పొందిన మొట్టమొదటి ట్రాన్స్‌ఆర్బిటల్ అఫ్ కాలిఫోర్నియా చరిత్రలో మొట్టమొదటి ప్రైవేట్ కంపెనీ చంద్రుని కక్ష్యలోకి



ఉపగ్రహ ప్రయోగ సమయంలో చంద్రుడి స్థానం

చంద్రయాన-1

చంద్రమండల ప్రయోగాలకు భారత్ కూడా శ్రీకారం చుట్టింది. తొలుత మానవరహిత ప్రాజెక్టు చేపట్టింది. 2007నాటికి ప్రయోగించాలని కృషి సాగిస్తోన్న ప్రాజెక్టుకు చంద్రయాన-1 అని నామకరణం చేసింది. విస్తృత పరిశోధన, విజ్ఞాన సముపార్జన ప్రయోగ లక్ష్యం. ఇందుకు విధానాలను ఖరారు చేసింది. పిఎస్ఎల్‌వి (పోలార్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్) ద్వారా రోదసి వాహనాన్ని నింగిలోకి ప్రయోగిస్తారు. చంద్రయాన-1ను మొదట భూస్థిరకక్ష్యలోకి ప్రవేశపెడతారు. భూమికి 240 కిలోమీటర్ల దూరంలో చంద్రయాన్‌లోని లిక్విడ్ అపోజీ మోటార్ లామ్‌ను రెండుసార్లు మండిస్తారు. తద్వారా రోదసి వాహనాన్ని భూమికి 3,86,000కిమీ దూరానికి చేరుస్తారు. అప్పుడది చంద్రగ్రహ బదిలీ కక్ష్యస్థానానికి సమీపంలో ఉంటుంది. చంద్రయానను అక్కడికి తీసుకెళ్లేందుకు ఐదున్నర రోజులు పడుతుంది. గమ్యం చేరాక మళ్లీ లామ్‌ను పేల్చుతారు. వృత్తాకార కక్ష్యలో చంద్రగ్రహానికి వెయ్యికిమీ దూరంలో నిలిపి సౌరఫలాకాలు విచ్చుకునేలా చేస్తారు. తర్వాత చంద్రయానను చంద్రుడికి 200కిమీ ఎత్తులో ఒకటి రెండు వారాలు నిలువుతారు. చంద్రయాన చంద్రుడి మధ్య దూరాన్ని నూరుకిలోమీటర్లకు కుదిస్తారు. అక్కడే స్థిరపరిచి రెండేళ్లపాటు అధ్యయనాలు సాగిస్తారు. ఈ సామర్థ్యం తమకున్నట్లు ఇస్రో ప్రకటించింది. సాధారణ ఉపగ్రహాలను ప్రయోగించే వాహనం కంటే చంద్రయాన వాహనం కొంత క్లిష్టమైనది. చంద్రయాన-1 నియంత్రణకు బెంగుళూరులో 100కోట్ల రూపాయల వ్యయంతో డీప్ స్పేస్‌నెట్‌వర్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 34మీటర్ల యాంటెన్నా ఉంటుంది. ఈ కేంద్రం చంద్రయాన-1 నాలుగు లక్షల కిలోమీటర్ల ఎత్తువరకూ చేరుకోవటంలో సాయపడుతుంది. అమెరికాలోని కాలిఫోర్నియా, గోల్డ్‌స్టోన్‌లోని మరో రెండు కేంద్రాలు ఈ నియంత్రణలో సాయపడతాయి.

చంద్రునిపై మెగ్నీషియం, అల్యూమినియం, సిలికాన్, కాల్షియం, ఇనుము తదితర లోహాల ఉనికిని గుర్తించడమే కాక హై రిసోల్యూషన్ పరికరాల ద్వారా సాధారణ, అల్ట్రావయలెట్ కిరణాల స్వభావాలను పసిగడుతుంది. ఈ సమాచారం త్రీడి అట్లాస్ తయారీకి ఉపయోగపడుతుంది. రోదసి వాహనంలో ఐదు కిలోమీటర్ల దూరంలో, 40కిలోమీటర్ల పరిధిలోని అంశాల్ని చిత్రీకరించే సామర్థ్యం గల అత్యాధునిక పరికరాల్ని అమర్చుతారు. వీటితో మరింత సమాచారాన్ని సేకరించవచ్చని ఇస్రో శాస్త్రవేత్తలు చెపుతున్నారు.

ప్రవేశించేందుకుగాను ట్రెయిల్‌బ్లేజర్ స్పేస్‌క్రాఫ్ట్‌కు అనుమతి ఇచ్చింది. దీంతో చందమామ ప్రయివేటీకరణ ప్రారంభమైంది. వాణిజ్యఅభివృద్ధికి చందమామ సిద్ధంగా ఉందని ట్రాన్స్‌ఆర్బిటల్‌కు చెందిన డెన్నిస్ లారీ అన్నారు. ట్రాన్స్‌ఆర్బిటల్‌కు అనుమతి దొరకడానికి రెండేళ్లసమయం పట్టింది. చందమామను చెత్త చెదారంతో కాలుష్యం చేయరాదని, గతంలోని ల్యాండింగ్ సైట్లను మార్చరాదని ప్రభుత్వం షరతులు విధించింది. చందమామ ప్రయాణం ఖర్చులు తగ్గుతాయని, అవకాశాలు పెరుగుతాయని లారీ చెప్పారు. చందమామ మిషన్లకోసం అనేక ప్రైవేట్ కంపెనీలు పోటీ పడుతున్నాయి. వర్జీనియాకు చెందిన ల్యూనా కార్ప్ సంస్థ కూడా పోటీలో ప్రధాన రేసులో ఉంది. తమ స్పేస్‌క్రాఫ్ట్ తీసిన ఫోటోలు, వీడియో చిత్రాలు అమ్మటం ద్వారా వచ్చే సొమ్మును మూన్ మిషన్‌కు ఉపయోగించాలని ట్రాన్స్‌ఆర్బిటల్, ల్యూనాకార్ప్ నిర్ణయించాయి.

చంద్రమండలం మీద స్థలాన్ని సొంతం చేసుకోండి. కాలుష్యానికి దూరంగా ప్రకృతి ఒళ్లో హాయిగా సేదతీరవచ్చు అంటూ అమెరికాకు చెందిన ల్యూనార్ ఎంబసీ సంస్థ ప్రకటన చూసి ఆశ్చర్యపోకండి. మీకు కొనగల స్థోమత ఉండాలే గానీ చంద్రుడు, ఇతర గ్రహాలపైనా ఆస్తుల్ని విక్రయించే అధికారాన్ని ఆ సంస్థ ప్రభుత్వం నుండి పొందింది. ల్యూనార్ రియాల్టీ సంస్థ చంద్రునిపై సర్వే చేయించి ఎకరానికో ప్లాటు చొప్పున నెంబర్లు వేయించాడు. ఇప్పటికే 180దేశాల్లో ప్లాట్ల అమ్మకం జోరందుకుంది. ఇరవైలక్షలమంది స్థలాలకు ఓనర్లయ్యారు. ఈ ప్లాట్ల అమ్మకం వెనుక చాలా చరిత్ర ఉంది. 'యుఎన్ ఔటర్ స్పేస్ ట్రీటీ' ప్రకారం భూమి వెలుపల అంతరిక్షంలో ఆస్తులు సంపాదించేందుకు, అధికారాన్ని ప్రకటించేందుకు ఏ ప్రభుత్వానికి హక్కు లేదని పేర్కొంది. ఈ ఒప్పందంలోని లొసుగును గమనించిన డెన్నిస్‌హోప్ ప్రైవేట్ వ్యక్తులపై నిషేధం విధించలేదంటూ అమ్మకాలకు శ్రీకారం చుట్టారు. ఒప్పందం సవరణకు ఐరాస పూనుకున్నా దేశాలు కలిసిరాకపోవడంతో మిన్నకుండిపోయింది. డెన్నిస్ హోప్ పక్కదండీ వ్యూహంతో చంద్రుడు, తొమ్మిది గ్రహాలమీద రియల్ఎస్టేట్ ప్రారంభించాడు. దీంతో అమెరికా మాజీ దేశాధినేతలు, హాలివుడ్ స్టార్లు స్థలాలు కొనేసుకున్నారు. వీరంతా కలిసి ముప్పైకోట్ల ఎకరాల ప్లాట్లను రిజిష్టర్ చేసుకున్నారు. కొన్ని సంస్థలు విహారయాత్రలకు ప్యాకేజీలు ప్రకటించాయి.

ట్రాన్స్ఆర్బిటర్ ట్రయల్‌బ్లుజర్ అనే అంతరిక్షనౌకను చంద్రుడిపైకి పంపేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇక స్పేస్ టూరిజమ్ కూడా ఊపందుకుంటోం దన్న మాట. వచ్చే 20సంవత్సరాల్లో చంద మామపై కాలనీ లు ఏర్పాటు చేసుకోవచ్చని శాస్త్రవేత్తలు చెపుతున్నారు.

ఇతర దేశాల ప్రయత్నాలు

1. స్మార్ట్-1 (2003 సెప్టెంబర్ 28న యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ప్రయోగించిన ఉపగ్రహం
2. ల్యూనార్ ఎ ఆగస్టు 2004న జపాన్ ప్రయోగించనున్న ఉపగ్రహం
3. సెలెన్ 2005లో జపాన్ ప్రయోగించనుంది



చంద్రునిపై వాతావరణం

భూమి ఉపగ్రహమైన చంద్రుడు భూమి పరిమాణంలో 80వ వంతు మాత్రమే ఉంటాడు. ఇది అత్యంత ప్రకాశవంతమైనది ఐనప్పటికీ చంద్రుని కంటే సూర్యుడు నాలుగులక్షల 65వేల రెట్లు కాంతివంతంగా ఉంటాడు. రాత్రిపూట ఆకాశంలో దగ్గరగా, పెద్దగా కనిపించే ఏకైక అంతరిక్ష వస్తువు చంద్రుడు. చిన్న టెలిస్కోపు లేదా బైనాక్యులర్స్ ద్వారా చంద్రుని ఉపరితలం కనిపిస్తుంది. చంద్రునిలో నీరు లేదు. వాతావరణం లేదు. ద్రవ్యరాశి తక్కువ. ఫలితంగా అది వాతావరణాన్ని తనలో నిలుపుకోలేకపోతోంది. చంద్రుని గురుత్వాకర్షణ శక్తి భూమి గురుత్వాకర్షణ శక్తిలో ఆరువంతు మాత్రమే. ఇక్కడ 60కిలోల బరువున్న వ్యక్తి చంద్రుని మీద పదికిలోలే ఉంటాడు. చంద్రుని మీద 20అడుగులు సునాయాసంగా ఎగురగలడు. వాతావరణం విచిత్రంగా ఉంటుంది. గాలి లేదు కాబట్టి అక్కడ శబ్దం వినపడదు. పగలు కూడా ఆకాశంలో నక్షత్రాలు కనిపిస్తాయి. ఆకాశం నల్లగా ఉంటుంది. సూర్యోదయం అవుతున్నట్లు తెలియదు. పగలు అత్యధిక వేడి(550ఫారన్‌హీట్) ఉంటుంది. రాత్రిళ్లు అత్యంత చలిగా ఉంటుంది. చంద్రుడు భూమి చుట్టూ దీర్ఘవృత్తాకార కక్ష్యలో తిరుగుతున్నాడు. సమీపంలో వచ్చినపుడు 2,21,463మైళ్లు, దూరంగా వెళ్లినప్పుడు 2,52,719మైళ్ల దూరంలో ఉంటాడు. భూమి చుట్టూ ప్రతి 27.33రోజులకొకసారి పరిభ్రమిస్తాడు. చంద్రబింబాన్ని చూస్తే మనకు నల్లని మచ్చలు కనిపిస్తాయి. చందమామలో కుందేలు ఉందని, చెట్టు కింద బామ్మ కూర్చుని ఉందని అనేక కథలు ఉన్నాయి. ఆ మచ్చలుండే ప్రాంతాలు చంద్రోపరితలం మీద పల్లపు ప్రాంతాలు. ఎత్తైన ప్రదేశాలపై సూర్యకిరణాలు పడి ప్రతిఫలిస్తాయి. పల్లపు ప్రాంతాలపైనవి పూర్తిగా ప్రతిఫలించవు. అందుకే ఈ నల్లదనం. ఒకప్పుడు ఆ మచ్చలని మహాసముద్రాలని అనుకునేవారు. వాటికి అలాగే పేర్లు పెట్టారు కూడా. కాని చంద్రుని నీరు మీద లేదని తెలిసింది. చంద్రుని ఉపరితలంపై పర్వతాలు, పెద్దపెద్దగోతులు ఉన్నాయి. గోతులనే క్రేటర్లు అంటారు. చంద్రుడు భూమి సాధారణంగా తర్వాతవి క్రేటర్లు, పర్వతాలు. భూమి మీద సముద్రాల్లో ఆటుపోటులు రావడానికి చంద్రుని ఆకర్షణ శక్తే కారణం. సూర్యుని కాంతి చంద్రుని మీద పడి అది పరావర్తనం చెంది భూమిని చేరుతుంది. అదే మనం అత్యంత ఇష్టపడే వెన్నెల. చంద్రునిపై మనకు కనిపించే తలం మీద సూర్యకాంతి పూర్తిగా పడితే మనకు సంపూర్ణ చంద్రబింబం కనిపిస్తుంది. ఆ రోజు పౌర్ణమి. క్రమంగా చంద్రబింబం క్షీణించి అమావాస్య రోజున అసలు కనిపించదు. ప్రతి 28వేల సంవత్సరాలకు భూమి 1.6కిలోమీటర్లు దగ్గరకు జరుగు తుంది. ఇదే విధంగా కొనసాగితే భూమి 100కోట్ల సంవత్స రాలకు భూమికి, చంద్రునికి మధ్య దూరం 15శాతం తగ్గు తుంది. ప్రతి 25లక్షల సంవత్సరాలకు ఒకసారి చంద్రుడు పూర్తిగా కనిపించడు. చరిత్రయుగంలో ఈ అద్భుతం 1866లో జరిగింది. అపోలో ఆస్ట్రొనాట్ అడుగులు మరో కోటి సంవత్సరాల వరకు చంద్రునిపై అలాగే ఉంటాయి. ●



అమెరికా 'ఉత్తుత్తి కథ'

సోవియట్ అంతరిక్ష విజయాలను చూసి గతుక్కుమన్న అమెరికా గ్రాఫిక్ చిత్రాల మాయాజాలంతో చంద్రునిపైకి అడుగుపెట్టినట్లు అబద్ధపు ఫోటోలు సృష్టించిందని, నిజానికి అది చంద్రునిపైకి వెళ్లలేదని అనేకమంది శాస్త్రవేత్తలు అనుమానాలు వ్యక్తం చేశారు. శాస్త్రవేత్తలు చెబుతున్న అంశాలను బిబిసి వార్తాసంస్థ కొద్దినెలల క్రితం వెలువరించి సంచలనం సృష్టించింది. అమెరికాకు చెందిన నెవెడా ప్రాంతంలో ఏరియా 51లో ఫోటోలు తీసిందని భావిస్తున్నారు. అమెరికా చిత్రించిన ప్రతి ఫోటో అనుమానంగా ఉందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

1. చంద్రుడి మీద భూమి మీద ఉన్నట్లు వాతావరణం లేదు. అందుకే గాలి ఉండదు. అయితే అమెరికా వ్యోమగాములు చంద్రునిపై పాతిపెట్టినట్లు చెబుతున్న జెండాలు రెపరెపలాడుతున్నాయి. ఇదెలా సాధ్యం.
2. చంద్రుడిపై ఒకే దిశలో నీడ కనపిస్తుంది. కానీ అమెరికా ఫోటోల్లో వివిధ దిశల్లో నీడలు ఉన్నాయి. నక్షత్రాలు కనిపించకపోవడం మరో అనుమానం కలిగిస్తోంది.
3. అపోలో నౌక తీసిన చిత్రాల్లో ల్యాండర్ ఇంజన్ నుండి మంటలు, పొగ లేకపోవడం రాకెట్ నిపుణులకు ఆశ్చర్యం కలిగిస్తోంది.
4. ఒక రాయిమీద సి అనే అక్షరం ఉంది. అదెలా సాధ్యం. చంద్రుడి మీద అక్షరాలెంటి. స్టూడియోలో తీసిందేననడానికి ఇదే సాక్ష్యమని అంటున్నారు.
5. చంద్రునిపై అసాధారణ వేడి ఉంటుంది. దీనికి ఫోటోఫిల్మ్ కాలిపోవాలి. కానీ అలా జరగలేదెందుకుని?

ఇలా ఎన్నో అనుమానాలు తలెత్తాయి.

34సంవత్సరాల క్రితం జూలై 20, 1969న అపోలో 11ద్వారా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎడ్విన్, ఆల్డ్రిన్ తొలిసారిగా చంద్రునిపైకి అడుగు పెట్టారు.

✻ డా॥ కె.ఎల్.వి.ప్రసాద్

జీవితం

గోదావరి ఎక్స్‌ప్రెస్ ఉదయం సకాలంలోనే సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంది. బండిదిగి హడావిడిగా బస్టాండ్ దగ్గరికి వచ్చేసరికి అప్పుడే 'మెహిదీపట్నం-సికింద్రాబాద్' బస్సు వెళ్ళిపోతూ కన్పించింది.

అప్పట్లో... అయితే, ఒక్క పరుగులో బస్సు అందుకొని ఎక్కేసి ఉండేవాడిని. మరి ఇప్పటి పరిస్థితి అట్లాంటిది కాదు కదా! వయస్సు పైన పడ్తుంటే, కుర్ర చేష్టలకు స్వస్తి పలకక తప్పదు మరి.

ఉదయం పూట కావడం మూలాన, దక్షిణ మధ్య రైల్వేలోని ప్రధాన జంక్షన్లలో సికింద్రాబాద్ కూడా ఒకటి కావడం మూలాన, స్టేషన్‌కు, వివిధ ప్రాంతాల నుండి రైళ్ళు రావడం మొదలు కావడంతో రైల్వేస్టేషన్‌తో పాటు, బస్టాండు కూడా జనంతో క్రిక్కిరిసి ఉంది. మళ్ళీ మెహిదీపట్నం వెళ్ళే మరో బస్సు కోసం ఎదురు చూస్తూ నిలబడ్డాం.

దూరంగా ఎక్కడి నుండో నా పేరు పెట్టి పిలుస్తున్నట్లు అన్పిస్తే అటువైపు తిరిగి చూచాను. నా వైపే నవ్వుకుంటూ, చేతులు ఊపుకొంటూ వస్తున్నాడు మిత్రుడు డా॥రాజ్‌కుమార్. అతను, నేను మెడిసిన్‌లో కలిసి చదువుకున్నాం. క్రమంగా ప్రాణస్నేహితులమైనాం.

అనుకోని రీతిలో, బస్టాండ్‌లో నిలబడ్డ నన్ను చూచినట్లున్నాడు. దూరంగా తన 'శాంత్రోకారు'ను పార్కింగ్ చేసుకొని, నన్ను సమీపిస్తూనే –

"హల్లో సుబ్బారావ్! ఏమిటి, ఇలా చెప్పా పెట్టకుండా ఈ భాగ్యనగరంలో..." అంటూ పలకరించాడు ఎంతో ఆప్యాయంగా.

"హాయ్ రాజ్...! అనుకోకుండా ప్రోగ్రాం పడింది [illegible] ఘన ఫ్రెండ్స్ ఎవ్వరికీ ఇన్‌ఫాం చేయలేదు. ఇంతకీ ఇంత పొద్దున్నే నువ్వు ఎటువెళ్తున్నట్లు" అన్నాను రాజ్‌ముఖంలోకి చూస్తూ.

"నేను ఎటు వెళ్తాగాని ఇప్పుడు నువ్వు కనపడ్డావ్‌కదా! నువ్ [illegible] వెళ్ళాలో చెప్పు. అక్కడికి నిన్ను క్షేమంగా చేరుస్తా" అన్నాడు నవ్వుతూ.

నన్ను మెహిదిపట్నంలో డ్రాప్ [illegible]. అక్కడ బహుశ ఒక గంట పని ఉండవచ్చు నాకు. నీకు టైమ్ పర్మిట్ చేస్తే తర్వాత నీతో గడపడానికి నాకు అభ్యంతరం లేదు" అన్నాను.

"ఆఁ... అట్లా అన్నావు. బావుంది! ఈ రోజంతా నువ్ నాతోనే గడపాలి. ఈవాళ నీ పుణ్యమా అని నే క్లినిక్‌కు డుమ్మా...!" అన్నాడు ఆనందంగా రాజకుమార్.

మెడిసిన్ పాస్ అయిన తర్వాత, హౌస్ సర్జన్సీ పూర్తి చేసి మరో ఆలోచన లేకుండా, రాజ్‌కుమార్ [illegible]గుట్టలో ప్రాక్టీసు పెట్టాడు. పేరుకు [illegible], డబ్బుకి డబ్బు బాగానే సంపాదిస్తున్నాడు. దానికి తోడు స్నేహానికి ప్రాణం పెట్టే మనస్తత్వం అతనిది. అందుకే మా స్నేహం ఇప్పటికీ సజీవంగా నిలిచిపోయింది.

మెహిదీపట్నం చేరే లోపుల, రాజ్‌కుమార్ నా దరికి చేరని ఎన్నో విషయాలు చెప్పుకొచ్చాడు. ఎన్నో విషయాలు పరస్పరం చర్చించుకున్నాం. ఎప్పుడు కలుసుకున్నా ముందుగా మా క్లాస్‌మేట్స్ గురించి, ప్రముఖంగా అమ్మాయిల గురించి, ప్రస్తుతం వాళ్ళ సెటిల్‌మెంట్ గురించి, ఇంకా ఎన్నో, ఎన్నెన్నో... రాజ్‌కుమార్ ఎంతసేపు మాట్లాడినా ఇంకా వినాలన్పిస్తుంది. ఈ రోజు కూడా అతను చెప్పుకుపోతుంటే, కేవలం వినడమే నా వంతయింది.

* * *

మెహిదీపట్నంలో పని ముగించుకుని ఇద్దరం డా॥ రాజ్ ఇంటికి చేరుకున్నాం. అప్పటికి రాజ్ శ్రీమతి ఇంట్లో లేనట్లుంది. బహుశా డ్యూటీ నుంచి ఇంకా ఇంటికి రాలేదేమో అనుకున్నాను.

రాజ్ మెడిసిన్ చదివే రోజుల్లోనే ఒక స్టాఫ్ నర్స్‌తో కలిసి తిరుగుతుండేవాడు. అయితే ప్రేమ, దోమ అన్న పదాలు అతని నోటి నుంచి విన్పించిన సందర్భాలు నాకు తెలిసినంత వరకు ఎప్పుడూ లేవు. అందరూ అతన్ని రోడ్‌సైడ్ రోమియోలా ట్రీట్ చేసేవారు. "అవసరాలు తీర్చుకొని, ఆ... పైన 'బై'... అంటాడులే!" అనుకునే వారు.



కాని అందరూ అనుకున్నట్లు, రాజ్, సుభద్రను మోసం చేస్తాడని నేను ఎప్పుడూ అనుకోలేదు. అందరి అనుమానాలకు బ్రేక్ ఇచ్చి ఆ... స్టాఫ్‌నర్స్ సుభద్రనే, తల్లిదండ్రుల ఆశీస్సులతో ఘనంగా పెళ్ళి చేసుకున్నాడు రాజ్. ఇప్పటికీ ఇద్దరూ ఎంత అన్యోన్యంగా ఉంటున్నారో, ఆ ఇంటి వాతావరణమే చెప్పక చెబుతోంది.

* * *

పూర్వం నర్సింగ్ కోర్సులో ఎక్కువగా నిరుపేదలైన కుటుంబాల నుంచి వచ్చిన బాలికలే ఉండేవారు. తినడానికి సైతం తిండి లేని కుటుంబాల్లో, రెండు పూటలా తృప్తిగా భోజనం చేయగల పరిస్థితులు, అమ్మాయిలు నర్సింగ్ కోర్సులో చేరడం ద్వారా ఆ కుటుంబాలలో సాధ్యమయ్యేది. పెళ్ళీడుకొచ్చిన తరువాత వాళ్ళకి అసలు సమస్యలు ప్రారంభమయ్యేవి.

నర్సులను పెళ్ళాడటానికి ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. అందుచేత వైవాహిక జీవితానికి దూరంగా ఉండేవాళ్ళు ఎక్కువగా ఉండేవారు.

కొంతమంది మాత్రం యౌవ్వనంలో ఉవ్వెత్తు కెరటాలై ఎగిసిపడే కోర్కెలను తట్టుకోలేక, క్షణికోద్రేకాలకు బానిసలై ఆనక నిండా మోసపోయి

బండబారిన జీవితాలతో బతుకు నెట్టుకుపోతుండేవారు.

కాని ప్రస్తుత పరిస్థితులు వేరు. గతంలో ఎక్కువ శాతం అట్టడుగు వర్గాల కుటుంబాల నుంచే ఈ వృత్తికి ఆకర్షితులయ్యేవారు. కాని ఇప్పుడు అన్ని వర్గాల నుండి ఈ వృత్తి పట్ల ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ వృత్తి పట్ల ప్రజలలో గౌరవం పెరగడం, జీతభత్యాలు సంతృప్తికరంగా ఉండడం, సాధారణ జీవితానికి మించి ఆనందంగా గడిపే అవకాశాలు ఉండడం వల్ల ఈ రోజున వా వ యా ల ం ఉద్యోగస్థులే కాక, జడ్జీలు, లాయర్లు, డాక్టర్లు, ఎన్నో రకాల క్లాస్‌వన్ ఆఫీసర్లు కూడా, నర్సింగ్‌లో స్థిరపడ్డ అమ్మాయిలను పెళ్ళి చేసుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

అయినా 'నర్సింగ్'ను నమ్ముకున్న కొంతమంది అమ్మాయిల పరిస్థితి, పెళ్లి విషయం వచ్చేసరికి అప్పటి మాదిరిగా యథావిధిగానే కొనసాగుతోంది. అది వేరే విషయం!

* * *

రాజ్, నేను భోజనాలు ముగించాం. తర్వాత పిల్లలు కూడా ఆ పని ముగించాక, ఇద్దరం గెస్ట్‌రూమ్‌కి వెళ్ళిపోయాం. ఈ గదిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నాడు రాజ్‌కుమార్. కాసేపు నడుం వాల్చాలనిపించి, మంచం మీద పడుకున్నాను. రాజ్‌మాత్రం, ఒక ప్లాస్టిక్ కుర్చీని నా మంచం దగ్గరికి లాక్కొని కూర్చున్నాడు. గతం తాలూకు కొన్ని మధుర క్షణాలను సింహావలోకనం చేసుకున్నాం. ప్రయాణ బడలిక వల్ల అనుకుంటా, ఎప్పుడు నిద్రపట్టేసిందో తెలిసింది కాదు.

* * *

రాజ్ బలవంతం మీద ఆ... రాత్రికి వాళ్ళ ఇంట్లోనే ఉండి మర్నాడు గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో విశాఖకు బయలుదేరాను. ఎప్పుడూ క్రిక్కిరిసి వుండే జనరల్ కంపార్ట్‌మెంట్, ఎందుకో ఈ రోజు వింతగా కన్పించింది. దానికి కారణం ఆ కంపార్ట్‌మెంట్‌లో కూర్చోవడానికి సీటు దొరకడమే! అవసరాన్ని బట్టి, ప్రయాణం చేయక తప్పక, రైల్లో సీటు దొరకక, నిలబడి-నిలబడి కళ్ళు తిరిగి పడిపోయేవాళ్ళు. కాళ్ళు వాచిపోయి చెప్పులు తెగిపోయే వాళ్ళు, ఎక్కువసేపు నిలబడలేక కంపుకొట్టే బాత్‌రూమ్‌లను సైతం ఆశ్రయించే వాళ్ళు. ఇలా ఉంటుంది గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో జనరల్ కంపార్ట్‌మెంట్ అసలు స్వరూపం.

అయినప్పటికీ, నేను జనరల్ కంపార్ట్‌మెంట్‌లోనే ప్రయాణం చేయడానికి ఇష్టపడ్తాను. రిజర్వ్‌డ్ కంపార్ట్‌మెంట్లలో 'బధిరులు' మాదిరిగా ప్రయాణం చేయడం నాకు ఇష్టం ఉండదు. జనరల్‌లో అయితే, రకరకాల వ్యక్తులు, వేషభాషలు, మాటలు ముచ్చట్లతో ఇట్టే కాలం గడిచిపోతుంది. కొన్ని క్షణాల్లోనే సమాజాన్ని మొత్తం చదివేసినట్లయిపోతుంది. పైగా రిజర్వ్ చేసుకున్నా ఆ.... బెర్తుల మీద నిద్రపట్టదాయె! నా దురదృష్టం కొద్దీ, ఈ రోజు జనరల్ కంపార్ట్‌మెంట్లో కూడా మాట్లాడే వారే కరువయ్యారు.

ఏమి చెయ్యాలో తోచక కుష్వంత్‌సింగ్ ఆంగ్ల నవల తీసి చదవబోయాను. కాని, ఎంతకూ అది చదవబుద్ధి కాలేదు. కారణం ఆ నవల బాగుండకపోవడం కాదు! రాజ్ వాళ్ళ ఇంట్లో చెప్పిన విషయాలు పదే పదే గుర్తుకు రావడం. కామేశ్వర్రావ్, కనకశేఖరంల గురించి రాజ్ చెప్పిన విషయాలు ఒకవైపు బాధిస్తూనే, మరోవైపు నా వైవాహిక జీవితాన్ని, సీతతో నాకు ఏర్పడ్డ పరిచయాన్ని గుర్తు చేశారు. మా స్నేహితులం అందరం ఇంచుమించు 'నర్స్'లనే జీవిత భాగస్వాములుగా ఎంచుకోవడం విశేషమే మరి!

* * *

ఆడవాళ్ళతో మాట్లాడాలన్నా, వాళ్ళతో పరిచయాలు ఏర్పరచుకోవాలన్నా, కలిసి తిరగాలన్నా, బస్సుల్లో, రైళ్ళల్లో ఆడవాళ్ళ పక్క సీటు ఖాళీగా వున్నా అక్కడ కూర్చోవాలంటే, నాకు సిగ్గుగా, కాస్త బెరుకుగా ఉండేది.

ఎంతోమంది నా క్లాస్‌మేట్స్ పైగా అందమైన అమ్మాయిలు నన్ను పలకరించడానికి ఎంత ప్రయత్నం చేసినా, నేను ఏదో వంకతో, తప్పించుకొని వాళ్ళకు దూరంగా వెళ్ళిపోయేవాడిని. మానవ మాత్రుడిగా, మగాడిగా, నాకూ అమ్మాయిలతో మాట్లాడాలని, కలిసి-మెలిసి తిరగాలని, ఆనందంగా గడపాలని మనస్సులో ఉన్నా, ఎందుకో చెప్పలేని భయం నన్ను ఆవరిస్తుండేది.

మెడిసిన్ పూర్తయి 'హౌస్ సర్జన్సీ'లోకొచ్చినా, నాలో ఈ విషయంలో పెద్ద మార్పంటూ రాలేదు. అలాంటి పరిస్థితుల్లో, నేను హౌస్ సర్జన్‌గా ఫిమేల్ సర్జికల్ వార్డులో పని చేస్తున్నప్పుడు ఒక విచిత్రమైన సంఘటన జరిగింది.

వార్డుపని పూర్తి చేసుకొని, చీఫ్ రౌండ్స్ అయిపోయిన తర్వాత లంచ్‌కోసం, హాస్టల్‌కు వెళ్ళే ఉద్దేశంతో చేతులు వాష్ చేసుకొని, అద్దంలో



చూసుకుంటున్న సమయంలో, ఒక నర్సింగ్ స్టాఫ్ నా వైపు రావడం గమనించానుగాని, నా గురించి అని మాత్రం అనుకోలేదు. ఆమె నా దగ్గరకు రావాలనుకున్నదల్లా, కాస్త దూరంలోనే ఆగిపోయి-

"నమస్తే డాక్టర్....!" అని విష్ చేస్తుంటే, కాస్త ఆశ్చర్యంగానే వెనక్కు తిరిగి, ఆమెకు విష్ చేశాను.

ముచ్చటైన తెల్లని యూనిఫాంలో, మిలమిల మెరిసే కళ్ళతో నవ్వి - నవ్వనట్లుండే రోజా రంగు పెదాలతో, ఆమె మళ్ళీ కళ్ళతోనే నాకు బదులు ఇచ్చింది.

మర్యాదను పాటిస్తూ తిరిగి 'నమస్తే' అన్న భావం వచ్చేట్లుగా తల వూపి, తిరిగి ముఖం కడుక్కుంటూ కాస్త ఇబ్బందిగా ఫీల్ అయ్యాను. అప్పటికే నా వళ్ళంతా చెమటతో తడిసి పోయింది.

ఆ... నర్స్ నా పరిస్థితి గమనించిందో ఏమో-

"మీతో చిన్న పని ఉంది. మీరు ఇప్పుడు లంచ్‌కు వెళ్తున్నట్లున్నారు. మరోసారి కలుస్తాను డాక్టర్!" అని చెప్పి కాస్త దూరంలో వున్న తన వార్డుకు వెళ్ళిపోయిందామె.

ఆమె కొత్తగా అపాయింట్ అయిన స్టాఫ్ నర్స్ అని, ఆమె పేరు సీతామహాలక్ష్మి అని, అందరూ 'సీత' అని పిలుస్తారని ఆ తర్వాత తెలిసింది.

అంతేకాదు ఆమె స్వగ్రామం కూడా, మా ఊరికి దగ్గర్లోని చిన్న పల్లె అని, ఆమె పెద్దవాళ్ళకు, మా పెద్దవాళ్ళకు పరిచయాలున్నాయని కూడా తర్వాత తెలిసింది.

ఆ.. రోజు ఆమె నా దగ్గరికి ఎందుకు వచ్చిందో తెలీదు గానీ, వారం రోజుల వరకు ఆ... అమ్మాయి మళ్లీ నాకు కన్పించలేదు.

డ్యూటీలో పూర్తిగా నిమగ్నమైపోవడంతో, ఇంచుమించుగా ఆమె సంగతి మరిచిపోయాననే చెప్పాలి. ఆ రోజు శుక్రవారం కావడంతో ఆపరేషన్ అయిన వారందరిని చూచి, ఇంజక్షన్ల పని పూర్తి చేసుకొని, వార్డులోని చిన్న చిన్న పనులు కూడా పూర్తయ్యాక, లంచ్ చేయడం కోసం హాస్టల్‌కు బయలుదేరుతున్న సమయంలో-

"సార్, సీత - సిస్టర్, మీకు ఈ కవరు ఇచ్చి రమ్మంది" అని, రంగురంగుల కవరు ఒకటి నా చేతికి ఇచ్చి, సలాం కొట్టి వెళ్ళిపోయాడు వార్డు బాయ్ యాదగిరి. కవరు చూడ్డానికి ఎంతో అందంగా ఉంది. రంగు, రంగు పువ్వుల డిజైన్‌తో మధ్యన 'మై ఫేవరేట్' అన్న అక్షరాలు ఆకర్షణీయంగా మెరుస్తూ కనిపించాయి. "చూడబోతే, ఇదేదో ఉత్తరంలా ఉందే!" అనుకున్నాను మనస్సులో

జీవితంలో ఉత్తరం అందుకోవడం నాకు మొదటి అనుభవం. పైగా పరిచయం లేని ఒక స్టాఫ్‌నర్స్ దగ్గరి నుండి వచ్చిన ఉత్తరం.

అలాగే ఉత్తరం రాసే అవకాశం కూడా నాకు ఎప్పుడూ రాలేదు. ఆధునిక సమాచార ప్రపంచంలో, సాంకేతిక పరిజ్ఞానం ఊహకు మించిపోయి, అందుబాటులోకి రావడంతో సెల్‌ఫోన్లు, ఇంటర్‌నెట్లు, ఇతర అత్యాధునిక సాధనాలు ఆవిర్భవించి సామాన్యులకు సైతం అందుబాటులోకి రావడంతో, మెదడుకు కాస్త మేత పెట్టే - ఈ ఉత్తరాలు రాసేకాలం అంతరించిపోయినట్లయింది. అందుకే ఇంతవరకు ఈ ఉత్తరాల పర్వం నా జీవితంలోకి ప్రవేశించలేదు.

కవరులో ఏమి రాసుందోనన్న ఆదుర్దాతో, చిరిగిపోకుండా జాగ్రత్తగా కవర్ తెరిచాను. క్షణంలో ఆమె రాసిన నాలుగు వాక్యాలు గడగడ చదివేశాను. చదివిందే మరోసారి - అలా ఎన్నిసార్లో ఆ ఉత్తరం చదివాను.

"డియర్ డాక్టర్ రావ్‌గారూ, నా గురించి మీకు పెద్ద ఎక్కువగా తెలియకపోయినా, మీ గురించి మాత్రం నాకు బాగా తెలుసు. అది ఎట్లా? ఏమిటి? అని నన్ను ప్రశ్నించకండి. ఇష్టమైన వారి గురించి, కాస్త కష్టపడితే, తెలుసుకోవడం పెద్ద సమస్య కాదు.

ఇంతకీ, అసలు విషయం ఏమిటంటే, ఈ రోజు నా పుట్టిన రోజు. నాకు పుట్టిన రోజు పండగ చేసుకునే అలవాటు లేదు. కాని మీ కోసం మీతో కలిసి కాస్సేపు మాట్లాడే దానికోసం నాకు ఊహ తెలిసిన తర్వాత మొట్టమొదటగా నా పుట్టిన రోజును గుర్తు చేసుకుంటున్నాను. ఈ సందర్భంగా 'హోటల్ గోల్కొండ'లో చిన్న టీ-పార్టీ ఇస్తున్నాను. అతి తక్కువ పరిచయంతో ఇలా ఆహ్వానించడాన్ని అన్యథా భావించకండి. ఈ విధంగా నాతో పది నిముషాలు గడపండి. ఇవన్నీ మీ కిష్టం ఉండవని నాకు తెలుసు. కాని, నా ఈ ఆహ్వానాన్ని తప్పక మన్నిస్తారనే ప్రగాఢ విశ్వాసంతో ఇది రాస్తున్నాను. సరిగ్గా

(మిగతా వచ్చే వారం)

మారిన రంగయ్య

* పి.ఎం.సుందరరావు

రంగయ్యకు బద్ధకం ఎక్కువ. రెండెకరాల పొలం వున్నా, దానిని సాగు చేయకుండా అంతే వదిలేశాడు. భార్య సూరమ్మే కూలి పని చేసి ఆ వచ్చిన డబ్బులతో అతికష్టంమీద కుటుంబాన్ని పోషిస్తోంది. ఏదో ఒక పని చెయ్యమని భార్య ఎంతగా బతిమాలినా ఆమె మాట వినేవాడు కాదు. పైగా 'పని చేయాల్సిన కర్మ నాకు లేదు. నాకు ఆకస్మిక సంపద లభిస్తుంది. దానికోసం కొంతకాలం ఆగాలి' అనేవాడు. బంధుమిత్రులు ఎన్నివిధాలుగా ప్రయత్నించినా రంగయ్య మనసు మారలేదు.

సూరమ్మ దూరపు బంధువు రామలింగాచారి. ఒకరోజు ఆయన రంగయ్య ఇంటికి వచ్చాడు. "ఈయన నాకు మేనమామ వరసవుతాడు. జ్యోతిష్యం, వాస్తుశాస్త్రంలో సిద్ధహస్తుడు" అని భర్తకు పరిచయం చేసింది సూరమ్మ. ఆ మాటలు వినగానే రంగయ్య మనసులో ఓ ఆలోచన మెదిలింది.

రామలింగాచారికి బాగా మర్యాదలు చేసి, "బాబాయిగారూ! నా చేతులు బాగా చూసి జాతకం చెప్పండి. నాకు ఆకస్మిక సంపద లభిస్తుందని గతంలో ఓ జ్యోతిష్యుడు చెప్పాడు. అదెప్పుడు లభిస్తుంది?' అని అడిగాడు ఆతృతగా. రామలింగాచారి అతని చేతులు పరీక్షగా చూసి, "మనం రేపు ఉదయాన్నే మీ పొలం వెళదాం" అన్నాడు.

మరుసటి రోజు ఉదయం ఇద్దరూ పొలం వెళ్లారు. రామలింగాచారి రెండెకరాల పొలం అడుగడుగూ పరీక్షించాడు. "రంగయ్యా! నీవు నిజంగా చాలా అదృష్టవంతుడివి. నీ పొలంలో లంకె బిందెలున్నాయి. అవి నీకు తప్పకుండా దొరుకుతాయి. కానీ, ఒక్క విషయం. ఈ రెండెకరాలలో అవి ఏ భాగంలో వున్నాయో చెప్పటం కష్టం. ఎందుకంటే అవి ఎప్పుడూ ఒక చోట స్థిరంగా వుండవు. కాబట్టి ఎవరూ గమనించకుండా నీ పొలంలో తవ్వి వాటిని సొంతం చేసుకో.." అని చెప్పాడు. తర్వాతి రోజే తన ఊరికి వెళ్లిపోయాడు.

రామలింగాచారి చెప్పింది విని రంగయ్య ఎంతో ఆనందించాడు. మరుసటి రోజు నుండి తెల్లవారుజామునే పొలం వెళ్లసాగాడు. దాదాపు నెలరోజులు కష్టపడి రెండెకరాల భూమినీ తవ్వాడు. ఎక్కడా లంకెబిందెలు కనిపించలేదు. రంగయ్య తన శ్రమ వృధా అయ్యిందని బాధపడ్డాడు.

అయితే తవ్విన పొలంలో సూరమ్మ కూరగాయల విత్తనాలు చల్లింది. అవి మొలకెత్తాయి. నెలరోజులు కష్టపడి తవ్వటానికి అలవాటుపడిన రంగయ్య ఇంటి దగ్గర ఊరకుండలేక పొలం వెళ్లడం ప్రారంభించాడు. సూరమ్మ ఎక్కువ కష్టపడి కూరగాయలు బాగా పండించింది. ఆ సంవత్సరం వాటికి బాగా ధర పలికింది. డబ్బు బాగా వచ్చింది.

అప్పుడు రామలింగాచారి రంగయ్య ఇంటికి వచ్చాడు. రంగయ్య ఆయనమీద మండిపడ్డాడు. "కోపగించుకోకు రంగయ్యా! నేను లంకెబిందెలు వున్నాయని చెప్పటం వల్లనే నువ్వు సోమరితనాన్ని వదిలి కష్టానికి అలవాటుపడ్డావు. ఈ రోజు కొంత ధనం సంపాదించగలిగావు. నిజానికి లంకెబిందెలనేవి లేవు. నీ భార్య నీ సోమరితనం గురించి చెప్పింది. నిన్ను మార్చటానికే ఈ నాటకం ఆడాను" అని అసలు విషయం చెప్పాడు.

రంగయ్య ఆలోచించి, తనలోని సోమరితనాన్ని విడిచేలా చేసిన రామలింగాచారికి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. అప్పటినుండి భార్యతో కలిసి మరింతగా శ్రమ చేస్తూ, హాయిగా బతుకుతూ, డబ్బు సంపాదించసాగాడు రంగయ్య.



నవ్వు ఏడుపు



హాయ్ నేస్తాలూ! ఏంటి కొందరు కోపంగా చూస్తున్నారు. మరికొందరు నవ్వుతూ చూస్తున్నారు. ఇలా అయితే ఎలాగమ్మా! మీరు అలా మూడీగా వుంటే మనం మేజిక్కులు చెప్పకునేదెలా! అందుకని అందరూ నవ్వాలి. సరేనా! ఓకే. అసలు విషయానికి వద్దాం. పై బొమ్మలో కొన్ని ముఖాలున్నాయి. అవన్నీ ఎంచక్కా నవ్వుతున్నాయి కదూ. కాదా! కొన్ని ఏడుస్తున్నాయా? 'అర్రే చిన్నారులూ...! చూడండి. బాగా చూసి చెప్పండి. మీకు కావాలంటే పావుగంట టైమ్‌కూడా ఇస్తాను. ఇంకా కావాలంటే పుస్తకాన్ని అటూ ఇటూ తిప్పి చూడండి. ఆ... ఇప్పడు చెప్పండి. 'అబ్బా! మీరు భలే కష్టమైన ప్రశ్న వేశారండీ. కొన్ని బొమ్మలు నవ్వుతున్నాయి. మరికొన్ని బొమ్మలు ఏడుస్తున్నాయి' అంటున్నారు కొందరు ఫ్రెండ్స్. కాదర్రా! అన్ని బొమ్మలు నవ్వుతున్నాయి. ఏడుస్తున్నాయి. రెండు పనులు చేస్తున్నాయి. పుస్తకాన్ని మామూలుగా పెట్టి చూస్తే కొన్ని నవ్వుతున్నట్టు, కొన్ని ఏడుస్తున్నట్టు కనబడుతున్నాయికదా. అదే తిరగేసి చూస్తే ఇందాక నవ్వినట్టున్న మొహాలు ఏడుస్తున్నట్టు, ఏడుస్తున్నట్టున్న తలలు నవ్వుతున్నట్టు వున్నాయి. అవునా? అదే మరి ఆర్టిస్టు అంకుల్ గొప్పతనం. ఒకే మొహంలో రెండు రకాల ఫీలింగ్స్ వచ్చేలా వేశారు. బావుందికదూ. మరి మీరు కూడా ఇంత బాగా బొమ్మలు వేయగలగాలి. ఓకేనా. టాటా.

మేజిక్! మేజిక్!!

రంగులు అద్దుతారా!





యల్.స్వరూప, 5వ తరగతి,
యుపిపిఎస్‌స్కూల్,
ఆదిలాబాద్, ఖానాపూర్

చిన్నారి చిత్రకారులు

కె.సూర్యతేజ,
7వ తరగతి,
సుందరయ్య నగర్,
తాడేపల్లి.

క్విజ్-91

1. తేలు కుట్టినప్పడు వేయవలసిన మందు?
   ఎ. పొటాషియం పర్మాంగనేట్
   బి. పొటాషియం హైడ్రాక్సైడ్
2. టీవీకి కంటికి మధ్య ఎంత దూరం వుండాలి?
   ఎ. 2 1/2 మీటర్లు బి. 1 1/2 మీటర్లు
3. దుమ్మును నిలవనీయని బట్టలు ఏవి?
   ఎ. పట్టు బట్టలు బి. నూలు బట్టలు
4. నీటిలో వుండే మూలకాలు ఏవి?
   ఎ. హైడ్రోజన్, ఆక్సిజన్ బి. హైడ్రోజన్, కార్బన్ డైఆక్సైడ్
5. ఎడారి మొక్క?
   ఎ. బ్రహ్మజెముడు బి. గులాబి
6. భారత దేశంలో ఆంగ్ల విద్యను ప్రవేశ పెట్టింది?
   ఎ. డల్‌హౌసీ బి. విలియం బెంటింగ్
7. ఏ జంతువుకు అరికాళ్లలో వెంట్రుకలుంటాయి?
   ఎ. కోతి బి. ధృవపు ఎలుగుబంటు
8. పన్నెండు తెలుగు మాసాలలో మొదటిది?
   ఎ. భాద్రపదం బి. చైత్రం
9. సహజరబ్బరు ఉత్పత్తిలో ప్రధమస్థానం పొందిన రాష్ట్రం?
   ఎ. మధ్యప్రదేశ్ బి. కేరళ
10. ఈ ఫొటోలోని వ్యక్తి పేరేంటి?
   ఎ: రిక్కీ పాంటింగ్
   బి. స్టీవ్ వా

క్విజ్ 90కి జవాబులు

1. ఆండిస్ 2. విశాఖపట్నం 3. గ్రహము 4. చైనీయులు 5. 12 జతలు 6.కాలేయము 7. మల్లె 8. మెడ ఎముక 9. జైపూర్ 10. మురసోలీ మారన్

క్విజ్ 89కి సరైన సమాధానాలు రాసిన వారు :

పెంటకోట అమర్ జయసింహ, విల్లూరి అక్కయ్యగారివీధి, గవరపాలెం,అనకాపల్లి. **జె.రామకృష్ణంరాజు,** 8వ తరగతి, జె.పంగుచారు, ప్రకాశం. **జె.గాయత్రి,** 10వ తరగతి, **యు.యు.బాబు నరేంద్రప్రసాద్,** 6వ తరగతి, లక్ష్మీపేట, ఎమ్మిగనూరు. **వి.వింధ్య,** 7వ తరగతి, కాశీబుగ్గ, శ్రీకాకుళం. **సి.సుందరమూర్తి,** 9వ తరగతి, అరసవిల్లి, శ్రీకాకుళం.

కలం స్నేహం

పేరు:జి.కిరణ్,
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : పాటలు పాడడం, కథలు చదవడం, డ్రాయింగ్ వేయడం, చెస్ ఆడుకోవడం.
పూర్తి చిరునామా : జి.కిరణ్, 10వ తరగతి, విశ్వ విజ్ఞాన్ స్కూల్, మన్నేటి కోట, ప్రకాశం.

పేరు: పదాల అనిల్ కుమార్,
వయసు : 13 సం॥
చదువు : 8 వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి పేపరు చదవడం, క్రికెట్, క్యారమ్స్ ఆడడం, సైకిల్ తొక్కడం, టీవీ చూడడం, తమ్ముడు మల్లిఖార్జునరావుతో ఆడుకోవడం.
పూర్తి చిరునామా : పదాల అనిల్ కుమార్, 8వ తరగతి, శ్రీ విద్యానికేతన్ స్కూల్, మల్లి ఖార్జున కాలనీ, రాజాం.



అది భాగీరథీ తీరం. అక్కడ ఒక గొప్ప జువ్వి చెట్టు వుంది. దాని తొర్రలో ఒక ముసలి గద్ద వుంది. దాని పేరు జరద్గవము. అది గుడ్డిది. బయటకు వెళ్లి ఆహారాన్ని సంపాదించుకోలేని నిస్సహాయ స్థితిలో వుంది. అందుకే ఆ చెట్టుమీద వున్న ఇతర పక్షులు దానిమీద జాలిపడ్డాయి. తాము తెచ్చుకున్న ఆహారంలో కొంత దానికి పెట్టేవి.

ఓ రోజు దీర్ఘకర్ణుడనే పిల్లి, పక్షి పిల్లలను తినడానికి ఆ చెట్టు దగ్గరకు వెళ్లింది. దాన్ని చూసి పక్షి పిల్లలు భయపడి అరవసాగాయి. ఆ అరుపులు విని గద్ద ఎవరో వచ్చారని తెలుసుకుంది. 'ఎవరూ? ఎవరది?' అంటూ గద్దించింది. అప్పుడు పిల్లి కపటనాటకమాడాలని నిశ్చయించుకుంది. 'నేను. దీర్ఘకర్ణుడననే పిల్లిని' అని చెప్పింది. అయితే నువ్వు ఇక్కడనుంచి వెళ్లిపో. లేకపోతే నీ ప్రాణం దక్కదు' అంటూ కోపంగా అరచింది గద్ద. 'ముందు. నా మాట విను. తర్వాత నువ్వు చెప్పినట్టు చేస్తాను. నేను పిల్లి జాతిలో పుట్టినా... మాంసం తినను. సత్యం తప్పను. బ్రహ్మచారిని. ముక్తి కోసం ముల్లోకాలు తిరుగుతుండగా నీవు సకల శాస్త్రములు తెలిసిన దానివని తెలిసింది. అందుకని నీ సేవ చేయడానికి వచ్చాను. అంతేకానీ వేరే దురుద్దేశం ఏం లేదు' అంది పిల్లి. 'అవునా! పిల్లులకు మాంసం అంటే ఇష్టం. ఇక్కడ పక్షి పిల్లలున్నాయి. ఆ కోపంతో అలా మాట్లాడాను. మరేం అనుకోకు' అంటూ గద్ద పిల్లిని చేరదీసింది.



గద్ద - పిల్లి కథ

పంచతంత్ర కథలు

ఆనాటి నుంచి పిల్లి, గద్ద దగ్గరకు వస్తూ పోతూ వుంది. తనమీద గద్దకు అనుమానం పోయిందని తెలుసుకున్నాక పిల్లి పక్షిపిల్లలను తినసాగింది. వాటి ఎముకలను మాత్రం గద్ద నివసించే తొర్రలో పడెయ్యసాగింది. ఈ మోసాన్ని గద్ద గ్రహించలేకపోయింది. పక్షులు తమ పిల్లలు కనిపించలేదని విచారిస్తూ ఆ విషయాన్ని చెప్పడానికి గద్ద దగ్గరకు వచ్చాయి. ఆ తొర్రలో పక్షిపిల్లల ఎముకలు కనిపించాయి. ఆ దృశ్యాన్ని చూసి పిల్లి మెల్లగా అక్కడినుంచి జారుకుంది. గద్ద తమ పిల్లల్ని తిన్నదని నమ్మిన పక్షులు దాన్ని గోళ్లతో రక్కి చంపేశాయి.

ఈ కథ చెప్పి 'అందుకే కొత్తవారిని నమ్మకూడదు' అంది కాకి. ఆ మాటలు విన్న నక్క కోపంతో ఊగిపోతూ 'ఓయీ! నీకన్నా బుద్ధిమంతులు లేరని ఎందుకు మిడిసిపడతావు? పొరుగువారు పచ్చగా వుంటే చూడలేని నీ పాపిష్టి గుణాన్ని పోనిచ్చుకున్నావుకాదు. నీవు మొదటిసారి ఈ లేడిని కలుసుకున్నప్పుడు నువ్వు కొత్తవాడివేగా? ఆ నాటి నుంచి మీరు స్నేహితులు కాలేదా! ఇప్పటికైనా నీ దుర్బుద్ధి విడిచి, మంచిగా జీవించు' అంది. అప్పుడు లేడి కలుగచేసుకుని 'మనలో మనకు తగాదాలెందుకు? మిత్రులైనా, శత్రువులైనా వారి ప్రవర్తననుబట్టే నిర్ణయించబడతారు. మంచిగా జరిగినంతకాలం మనం స్నేహంగా వుండడంమేలు' అంది. అప్పటినుంచి లేడి, కాకి, నక్క స్నేహంగా వుండసాగాయి.

ఎగిరే నక్క

ఎగిరే నక్క అంటే గుంట నక్క అనుకునేరు! కానే కాదు. ఇది ఒక జాతి గబ్బిలం. దీని ముఖము, తల నక్కను పోలి వుంటాయి. అందుకే దీనికి ఆ పేరు వచ్చింది. కాని ఎగిరే నక్క దాదాపు చిన్న కుక్క అంత పెద్దగా వుంటుంది. దీని రెక్కలు ఆరు అడుగులుంటాయి. వీటికి పొడవైన పదునైన దంతములుంటాయి. కొబ్బరికాయను కూడా దంతములతో పగులగొట్టగలవు. ఇవి సింపుల్‌గా కేజీన్నర బరువుంటాయి.

రోసా లగ్జెంబర్గ్

రోసా లగ్జెంబర్గ్.. ఈ పేరు బహుశా ఇప్పటి తరానికి తెలియదు. పోలెండ్‌లో పుట్టిన ఈ యూదు మహిళ జర్మనీ పౌరసత్వం తీసుకుంది. రష్యన్ విప్లవంతో ఉత్తేజితురాలై జర్మనీలో కమ్యూనిస్టు విప్లవం కోసం పోరాడుతూ సైనికుల చేత దారుణహత్యకు గురైంది. ఆమె సహచరుడు లీబ్క్నెట్‌ను కూడా జర్మనీ సైనికులు ఆమెతోబాటే హతమార్చారు. జర్మనీ కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో ఆమె ఒక భాగం. సోషల్ డెమొక్రాట్ పార్టీలో పనిచేస్తూ కమ్యూనిస్టు విప్లవం కోసం పరితపించిన వీరనారి రోసా. ఆమె జర్నలిస్ట్ కూడా. 1871 మార్చి 5న జన్మించిన రోసా 1919 జనవరి 15న హత్యకు గురైంది.

జార్ చక్రవర్తుల రష్యన్ మహా సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉన్న పోలెండ్‌లో జన్మించిన రోసా వార్సా నగరంలో విద్యాభ్యాసం చేసింది. వార్సాలో చదువుతూనే రష్యన్ విప్లవ కార్యక్రమాల్లో పాల్గొంది. అరెస్ట్ చేసే పరిస్థితి రావడంతో జర్మనీ వెళ్ళింది. ఆ తర్వాత స్విట్జర్‌లాండ్‌లోని జ్యూరిచ్ యూనివర్సిటీలో నాచురల్‌సైన్స్, రాజకీయ అర్థశాస్త్రాలను అభ్యసించింది. పోలెండ్‌లో పారిశ్రామిక అభివృద్ధిపై పరిశోధానాత్మక గ్రంథం ప్రచురించినందుకు గాను డాక్టరేట్ పుచ్చుకుని ఫ్యూడల్ సమాజాన్ని ఆశ్చర్యపరిచింది. జర్మనీ కార్మికుడిని వివాహమాడి అనంతరం ఆ దేశ పౌరసత్వం తీసుకుంది. రష్యన్ జార్ చక్రవర్తిపై 1905లో వెల్లువెత్తిన తొలి విప్లవంలో పాల్గొనేందుకు మాతృగడ్డ అయిన పోలెండ్ వెళ్ళింది. వార్సాలో సాయుధపోరులో పాల్గొని జైలు జీవితం గడిపింది. విడుదలైన అనంతరం బెర్లిన్ వెళ్ళి 1907 నుండి 1914 వరకు సోషల్ డెమొక్రటిక్ పార్టీ స్కూల్‌లో అధ్యాపకురాలిగా పనిచేసింది. ఈ కాలంలోనే పెట్టుబడిదారీ వ్యవస్థ గురించి 'ఎక్యూములేషన్ ఆఫ్ క్యాపిటల్' అనే గ్రంథం రచించింది. జర్నలిస్ట్‌గా పలుపత్రికలలో వ్యాసాలు రాసింది. మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభమైన దశలో జర్మన్ సోషలిస్ట్ నాయకుడు కార్ల్ లీబ్క్నెట్‌తో కలిసి సోషల్ డెమొక్రట్ పార్టీలో విప్లవకారులతో రోసా ఒక గ్రూప్ ఏర్పాటు చేశారు. వీరంతా యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకించడంతో జైలుశిక్ష విధించారు. 1918లో జైలు నుండి విడుదలయ్యాక విప్లవకారులంతా జర్మన్ కమ్యూనిస్టు పార్టీలోకి వెళ్లడానికి కృషిచేశారు. జర్మనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటుకు ఆమె చేసిన ప్రయత్నం విఫలమైంది. బెర్లిన్‌లోనూ దేశంలోని పలుప్రాంతాల్లోనూ కొన్నిరోజులపాటు పోరాటం జరిగింది. అయితే సైనికులదే పైచేయి అయింది. జర్మనీ సైనికులు రోసాను, లీబ్క్నెట్‌ను అరెస్ట్ చేసి దారుణంగా హత్య చేశారు. కారల్‌మార్క్స్ బోధలతో ఉత్తేజితురాలైన రోసా, రష్యాలో బోల్షివిక్ విప్లవం విజయవంతం కాకముందే ప్రపంచాన్ని విముక్తి చేసేది మార్క్సిజం మాత్రమేనని సంపూర్ణంగా

విశ్వసించారు. 1917లో రష్యాలో అక్టోబర్ విప్లవం విజయవంతం కావడంతో జర్మనీలో కూడా ఆ తరహా విప్లవం తీసుకురావాలని గట్టిగా వాంఛించారు. చిన్ననాడే జబ్బుపడి పాక్షికంగా వికలాంగురాలైనా ఉన్నత విద్య నభ్యసించడానికి ఆ వైకల్యం అడ్డురాలేదు. దాని గురించి ఏనాడూ బాధపడలేదు. పోరాటమే జీవితంగా గడిపారు. మాతృదేశమైన రష్యాలో విప్లవం కోసం, అలాగే కడదాకా జీవించిన జర్మనీలో మార్క్సిస్ట్ విప్లవం కోసం ఆమె పోరాడారు. కఠినశిక్షలు అనుభవించారు. చివరకు సైనికుల చేతిలో మరణించారు.

లీబ్క్నెట్

జర్మనీ సోషల్ డెమొక్రటిక్ పార్టీ వ్యవస్థాపకుల్లో కార్ల్ లీబ్క్నెట్ ఒకరు. న్యాయవాది అయిన లీబ్క్నెట్ తన పార్టీ వారినెందరినో రాజకీయ విచారణ సందర్భంగా జైలుశిక్షల బారి నుండి కాపాడారు. ఆనాడు యూరప్‌లో ముఖ్యంగా జర్మనీలో యూత్ సోషలిస్ట్ ఉద్యమంలో, సైనికపాలకులకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ముఖ్యనాయకుడిగా పేరుపొందారు. 1914లో చట్టసభలో యుద్ధంపై జరిగిన చర్చ సందర్భంగా యుద్ధానికి వ్యతిరేకంగా ఓటేశారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి యుద్ధానికి వ్యతిరేకంగా తీవ్ర ప్రచారం చేశారు. దీనితో ఆయన పార్లమెంట్ సభ్యత్వం పోవడమే గాకుండా జైలుపాలయ్యారు. జైలునుండి విడుదలయ్యాక రోజా లగ్జెంబర్గ్‌తో కలిసి న్యూ కమ్యూనిస్ట్‌పార్టీ స్థాపించారు. ఆ తర్వాత జరిగిన తిరుగుబాటు సందర్భంగా రోసాతో పాటు సైనికులచే హత్యకు గురయ్యారు.

* అంపశయ్య నవీన్

నాటకాన్ని బతికించుకోవాలి



"నిన్న సాయంత్రం ఎటో వెళ్ళినట్టున్నారు?"

"ఓ నాటకం చూద్దామని వెళ్ళాను"

"నాటకం చూద్దామనా?"

"అవును. ఎందుకలా అడిగారు?"

"ఈ రోజుల్లో కూడా నాటకాలు చూసే వాళ్ళున్నారా అని అలా అడిగాను"

"ఎందుకుండకూడదు? దేని గొప్పతనం దానికుంటుంది"

"ఉండొచ్చు... కానీ సినిమాలు రావడంతో నాటకాలు మూతబడిపోయాయి కదా!"

"సినిమాలు రావడంతో ఒక్క నాటకాలే కాదు -ఎన్నో ఇతర కళలు కూడా దెబ్బతిన్నాయి. అయితే సినిమాల మీద విపరీతమైన మోజుతో మనం ఇతర కళల్ని పోగొట్టుకోకూడదు..."

"పోగొట్టుకోకూడదు.. నిజమే.. కానీ కాల ప్రవాహానికి తట్టుకోలేనిదేదైనా ఆ ప్రవాహంలో కొట్టుకుపోక తప్పదు... టీవీలు రావడంతో రేడియోలు మూతపడ్డాయా? మల్టీ ఛానెల్స్ రావడంతో దూరదర్శన్‌ను ఎవరూ చూడకుండా అయిపోయిందా?"

"అదే మన ట్రాజడీ! సినిమాలూ, టీవీల కారణంగా మనం ఎన్నో గొప్ప కళలకు దూరమైపోతున్నాము... ఇతర దేశాల్లో ఇలాంటి పరిస్థితి లేదు. కొత్తవి ఎన్నొచ్చినా వాళ్ళు పాతవాటిని కూడా కాపాడుకుంటున్నారు. ఇతర దేశాల్లోనే ఎందుకు? మన పక్క రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్రల్లో కూడా నాటకం ఇంకా బతికే ఉంది."

"ఇంతకూ మీరు నిన్న ఏనాటకానికెళ్ళారో చెప్పనేలేదు..."

"నిన్న నేను సురభి నాటక సమాజం వారు ప్రదర్శించిన 'మాయా బజారు' నాటకానికి టికెట్ కొనుక్కొని మరీ వెళ్ళాను"

"మాయా బజారు నాటకానికా? అదీ టికెట్ కొనుక్కొని చూశారా? ఘటోత్కజుడులాంటి రాక్షసులు చేసే మహిమలన్నీ ఆ నాటకంలో ఎలా చూపించారు? 'మాయాబజారు' సినిమా చూసిన వాళ్ళకి నాటకం నచ్చుతుందా?"

"నేనూ అలాగే అనుకున్నాను. కానీ నాటకం చూశాక చాలా ఆశ్చర్యపడ్డాను. ఎందుకంటే సినిమాలో ఎన్నెన్ని అద్భుతాల్ని చూపించారో నాటకంలో కూడా అన్ని అద్భుతాల్ని చూపించగలిగారు. నాటకరంగం మీద.అన్ని అద్భుతాలను చూపించడంతో ప్రేక్షకులు చాలా థ్రిల్లయ్యారు.."

"అసలు ప్రేక్షకులంటూ ఎవరైనా ఉన్నారంటారా?"

ఎందుకు లేరు... నాటకాల్ని ప్రేమించే నాలాంటి చాలామంది ఆ నాటక ప్రదర్శనకొచ్చారు. చాలాసార్లు పరవశించిపోయి చప్పట్లు కొట్టారు. కృష్ణుడు, బలరాముడు, అభిమన్యుడు మొదలైన వాళ్ళు రాగయుక్తంగా పద్యాలు చదువుతోంటే ప్రేక్షకులు "వన్స్‌మోర్" అంటూ అరిచారు."

"ఈ రోజుల్లో చాంతాడంత రాగం తీస్తూ నటీనటులు పాడే పద్యాలను వినేవాళ్ళెవరైనా ఉన్నారా అని నా సందేహం"

"నీకన్నీ సందేహాలే... పద్యం అనేది తెలుగువాళ్ళ ప్రత్యేకత... వేరే ఏ భారతీయ భాషలో కూడా ఈ పద్యాలనేవి లేవు అనే విషయం నీకు తెలుసా?"

"అలాగా? నాకీ విషయం తెలియనే తెలియదు"

"ఘంటసాల పాడిన పద్యాలు నువ్వెప్పుడైనా విన్నావా?" "సంధ్య వెలుగులో పసిడి ఛాయల ఖద్దరు చీరగట్టి నారింజకు నీళ్ళుపోయు శశిరేఖవే నీవు" లాంటి కరుణశ్రీ పద్యాల్ని ఘంటసాల ఎంత అద్భుతంగా గానం చేశాడో! అలాగే కురుక్షేత్ర నాటకంలోనూ, పాండవోద్యోగ నాటకంనూ "బావా ఎప్పుడు వచ్చితీవు?", "చెల్లియో చెల్లకో" లాంటి పద్యాల్ని కృష్ణపాత్రధారి పాడుతోంటే ప్రేక్షకుల హృదయాలు పులకించిపోతాయి..."

"పౌరాణిక నాటకాల మాట అలా ఉంచు... సాంఘిక నాటకాల సంగతేమిటి? సాంఘిక నాటకాల్ని ప్రదర్శించి ఒప్పించడం గొప్ప..."

"సాంఘిక నాటకాల్ని కూడా గొప్పగా ప్రదర్శించి ఒప్పించే ఔత్సాహిక నాటక సంస్థలెన్నో ఆంధ్రదేశంలో వున్నాయి... ఒకప్పుడు "మాభూమి" "ముందడుగు", 'పల్లెటూరు', 'వాపస్' 'ఎన్.జి.ఓ' లాంటి ఎన్నో సాంఘిక నాటకాలు ఎంత ప్రజాదరణ పొందాయో నీకు తెలియదేమో "మీరెన్నైనా చెప్పండి... నాటకాల్ని ఫ్రీగా చూపిస్తే ఎవరైనా చూస్తారేమోగానీ, టికెట్టుకొని చూడమంటే మాత్రం ఎవరూ చూడరు..."

"అదే మన దౌర్భాగ్యం... సినిమాల మీద ఎంత డబ్బైనా తగిలేస్తాంగానీ నాటకాలను మాత్రం టికెట్ కొనుక్కొని చూడం. తెలుగు వాడు మంచి పుస్తకాలను కొనుక్కోడు... పేపర్లూ కొనుక్కోడు.. పక్కవాడు కొంటే వాడి దగ్గర్నుంచి తీసుకుంటాడు. నాటకాలను టికెట్ కొనుక్కొని చూడడు. పక్క తెలుగువాడు గొప్పవాడంటే ఒప్పుకోడు... సినిమాలను మాత్రం వెర్రిగా చూస్తాడు. బార్లల్లో ప్రవేశించి పీకల దాకా తాగుతాడు.. ఇంటికొచ్చి పెళ్ళాం మీద పెత్తనం చేస్తాడు"

"ఇవ్వన్నీ తెలుగువాళ్ళ లక్షణాలంటారు"

"అవును..."

"మాయాబజార్ నాటకం చూశానన్నారు కదా... సినిమాలో చూపించిన అద్భుతాలనూ, రాక్షసుల మహిమలనూ చూపించారన్నారు కదా.. అదెలా సాధ్యమయిందంటారు"

"సురభి నాటక సమాజం వారు మన ఆంధ్రదేశంలో చాలాకాలంగా నాటకాలను ప్రదర్శించడం తమ పవిత్రమైన బాధ్యతగా భావించి అనేక పౌరాణిక నాటకాలను ప్రదర్శిస్తున్నారు. సినిమాతో పోటీ పడటం కోసం సినిమాల్లోని హంగులన్నీ తమ నాటకాల్లో కూడా ఉండేలా చూసుకుంటున్నారు. సాంకేతికంగా తమ నాటక ప్రదర్శనలను ఎంతో అభివృద్ధి చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కృష్ణార్జునుల రథాన్ని నాటక రంగం మీదికి తీసుకురావడం, తమ్ముడే అని తెలియక ముందు ఘటోత్కజుడు అభిమన్యునితో యుద్ధం చేసే ఘట్టంలో రంగస్థలం మీద బ్రహ్మాండమైన ధ్వనుల్నీ, నిప్పుల్నీ సృష్టించడం, భీముడు, దుర్యోధనుడితో గదా యుద్ధం చేసే ఘట్టాన్నీ సురభి వారు ప్రేక్షకుల్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచేసేలా ప్రదర్శించారు. అయితే నాకు బాధ కలిగించిన విషయమేమిటంటే సాంకేతిక అంశాలకు ఇచ్చినంత ప్రాధాన్యాన్ని వాళ్ళు నటీనటుల వాచికానికివ్వకపోవడం నాటకానికి సంభాషణలు ప్రాణం - సంభాషణల్ని స్పష్టంగా, భావయుక్తంగా చెప్పడంలోనే ఒక నటుడి ప్రతిభ వ్యక్తమవుతుంది. సురభి నాటక సమాజంలోని చాలా మంది నటీనటుల ఉచ్ఛారణ స్పష్టంగా లేదు. వాళ్ళు మాట్లాడుతున్నది తెలుగేనా అన్న సందేహం కలిగింది. పద్యాలు పాడటంతోటే తమ పని అయిపోయిందనుకుంటారు తప్ప సంభాషంల్ని సరిగా చెప్పాలని వాళ్ళు అనుకుంటున్నట్టు లేదు. అలాగే స్పెషల్ ఎఫెక్ట్స్ నాటకం అనుకుంటున్నారు - పౌరాణిక నాటకాలనే కాకుండా వాళ్ళు సాంఘిక నాటకాల్ని కూడా ప్రదర్శించడం నేర్చుకోవాలి".

మా పిన్ని కొడుకు

కూరగాయల్ని కళ్ళు మూసుకుని కొనుక్కోం!

చచ్చువీ పుచ్చువీ వుంటాయి గనక చూసుక్కొనుక్కుంటాం!

అలాగే–

మన్నికా నాణ్యత మెరుగ్గా వుండాలనే ఉద్దేశంతో – బట్టల దుకాణం మొత్తం గాలించి ఒక చొక్కా గుడ్డ కొనుక్కుంటాం. వెరైటీలు ఎక్కువగా వుంటే మన ఎన్నిక కూడా కష్టమవుతుంది!

ఏది కొనాలో ఏది అవతల పెట్టాలో తోచి చావదు!

ఆఫ్టరాల్ చొక్కాగుడ్డ కొనుక్కొనే ప్రోగ్రాంలోనే ఇంత రభస జరుగుతునప్పుడు – పెళ్ళి విషయంలో యింకెంత జాగ్రత్త పడాలో తమరే ఆలోచించండి!

కూరలు ఒక పూటలో ఖర్చవుతాయి! ఒంటిమీద బట్టలు ఆర్నెల్లో ఏడాదో ఉంటాయి. ఆ తర్వాత వాటి యోగాన్ని బట్టి అలుగ్గుడ్డ కింద మారిపోవచ్చు. స్టీలు చెంబాగా మార్చుకోనూవచ్చు!

ఈ టైపు అషామాషీ వ్యవహారం కాదు పెళ్ళి!

పెళ్ళి నూరేళ్ళ పంటన్నారు పెద్దలు!

ఆర్నెల్లు కాపరం చేసి – ఇక చాల్లే హిమాలయాల్లో సెటిలవుతానని భర్త తన కోరిక చెబితే – బంధువులు అతన్ని చెప్పుతో కొడతారు! నువ్వు బోరు కొడుతున్నావు గనక ఇంకో భార్యని చేసుకుంటానని భర్త భార్యతో చెప్పినా చట్టం ఊరుకోదు! చెంపలు వాయిస్తుంది!

అంచేత –

అల్లాంటి ప్రమాదాలు మునుముందు జరక్కూడదనే ఉద్దేశంతో సదరు పెళ్ళికి ముందు పెళ్ళి చూపులనే తతంగం ఏర్పాటు చేసేరు! ఒకరికొకరు పూర్తిగా నచ్చితేనే కలకాలం కలిసి ఉంటామనే అగ్రిమెంటుకి రమ్మని చెబుతున్నారు!

ఈ మధ్య ఎక్కడో చదివేను –

పెళ్ళి చూపులకెళ్ళిన కుర్రాడ్ని పచ్చడి చేసేరుట! శుభం!

అతనొక రైల్వే గుమాస్తా. పెళ్ళి చూపుల కెళ్ళేడు. ఎంతైనా పెళ్ళి చూపులు గదాని ఆడపిల్ల వాళ్ళు ఘనంగానే మర్యాదలవీ చేసేరు!

అమ్మాయిని హాల్లోకి తీసుకొచ్చి కూచోబెట్టేరు!

అబ్బాయి అమ్మాయిని చూసేడు. అందచందాలు ఆల్‌రైటనే ఉద్దేశాన్ని ముఖకవళికల ద్వారా తెలియచేసేడు. అమ్మాయిని పాడమన్నాడు. పాట విన్నాడు. అడ్డమైన ప్రశ్నలడిగి ఆన్సర్లు విన్నాడు. చివరికి అంతా బావుందని కూడా సెలవిచ్చేడు! కట్నకానుకల విషయం మీ పెద్దవాళ్ళతో మాట్లాడుకుంటాం అని ఆడపిల్ల వారు అన్నారు! అనవసరం అన్నాడు పెళ్లి కొడుకు!

బహుశా పాత పద్ధతులు గిట్టని కుర్రాడేమోనని ఆడపిల్లవారు భ్రమపడి ఆనందించేరు!

ముహూర్తం ఎప్పుడు పెట్టించుమన్నారని అబ్బాయిని అడిగేరు. అప్పుడే తొందరేమిటని అబ్బాయి విసుక్కున్నాడు! పిల్ల నచ్చిందన్నారు గదా – ముహూర్తం పెట్టుకుని ఆ మూడు ముళ్ళూ వేయించేస్తే మా బాధ్యత తీరిపోతుంది గదా అన్నారు ఆడపిల్లవాళ్ళు!

మీ అమ్మాయి బావుందన్నానేగాని ముహూర్తాలు పెట్టించమని అనలేదు గదా అని పెళ్ళికొడుకు నసిగేడు. నీకు నచ్చింతర్వాత ముహూర్తాలు పెట్టుకోడమే తర్వాత కార్యక్రమం గదా అన్నారు పెళ్ళివారు! నేను ఇంకా కొందరమ్మాయిల్ని చూడాలనుకుంటున్నాను. ఆ తర్వాత వాళ్ళల్లో ఏ పిల్ల బాగా నచ్చితే – ఆ పిల్లను చేసుకుంటాను అన్నాట్ట పెళ్ళికొడుకు!

ఇది మంచి పద్ధతేనా?

అమ్మాయిని చూసి నచ్చిందన్న తర్వాత – ఇంకా కొన్ని సంబంధాలు చూచి తన నిర్ణయం చెబుతాట్ట! ఆ పని ఎప&పటికి పూర్తయ్యేను?

అతని మాట వినగానే ఆడపిల్ల వాళ్ళు ఓర్చుకోలేక పోయేరు. ఒళ్ళు మండిపోయింది. ఆ కుర్రాడ్ని వీరబాదుడు బాదేరు. రిస్టువాచీ, పర్సు గట్రాలు లాక్కుని నీ దిక్కున్నచోట చెప్పుకోపొమ్మని ఇంట్లోంచి మెడపట్టుకు గెంటేసేరు!

వార్త చదవగానే మొదట అయ్యోపాపం అనిపించింది! ఆ విధంగానే జరగాలని ఆ తర్వాత అనిపించింది!

సందర్భం వచ్చింది గనక మా పిన్నిగారబ్బాయి గురించి కూడా చెప్పాలి. నిండా పద్దెనిమిదేళ్ళు నిండకుండానే వాడికి పెళ్ళి చేసుకోవాలనే కోరిక కలిగింది!

ఆ విషయం నిర్భయంగా బాబాయి చెవిన వేసేడు!

ఆ మాటవినగానే బాబాయి గాండ్రించేట్ట! వెధవంట వెధవా అన్నాట్ట. నిండా పద్దెనిమిదేళ్ళు లేవు – నీకు పెళ్ళి కావాల్సి వచ్చిందా? ఇంకో తడవ ఆ కూత కూసేవంటే పళ్ళు రాలగొడతాను జాగ్రత్త! వెళ్లి గోలీ కాయలు ఆడుకోపొమ్మని కసిరి కొట్టేట్ట బాబాయి!

ఈ గొడవ నాకు చెప్పి ఘొల్లున ఏడ్చేడు పిన్ని గారబ్బాయి. అవునొరేయ్ నీకిప్పుడు పెళ్ళికి తొందరేమిటని అడిగేను. పెళ్ళి కోసం కాదే అక్కా – పెళ్ళనగానే పెళ్ళి చూపులుంటాయి గదా! ఎంచక్కా అమ్మాయితో మాటాడుకునే ఛాన్సు దొరుకుతుంది కదా అన్నాడు వాడు ఎంతో ఆనందంగా!

వాడు నాకు తమ్ముడే కావచ్చు! ఇంత చిన్న వయసు నుంచే పెళ్ళి చూపుల పట్ల వాడికున్న అభిప్రాయాన్ని విని తట్టుకోలేకపోయేను! అందమైన అమ్మాయితో హాయిగా మాట్లాడుకునేందుకు మాత్రమే పెళ్ళి చూపులు ఉపకరిస్తాయనే వాడి సిద్ధాంతమ్మీద నాక్కూడా ఒళ్లు మండిపోయింది! వాడ్ని చెప్పుచ్చుక్కొట్టాలనిపించింది!

ఒక్క మా పిన్ని కొడుకునే ఎందుకు ఆడిపోసుకోవాలి? పురుషాధిక్య నేలమీద బతుకుతున్నాం గదా! మా పిన్నికొడుకు టైపులో పెళ్ళికొడుకులు చాలా మంది వున్నారు. పెళ్ళి చూపుల్లో వాళ్ళు ఆడపిల్లల్నే చూస్తారు తప్ప – వాళ్ళ అంతరంగాన్నీ మానసిక పరిస్థితులను అస్సలు పట్టించుకోరు! ఈ అన్యాయాన్నీ అరాచకాన్నీ వచ్చే వారం మనవి చేసుకుంటాను! ●

ఎలక్షన్ (సెల్) ఫోన్

"అక్కా... లచ్చుక్కా... అబ్బబ్బ... అంతచెవుడేందే? నిన్నే పిలిచేది... ఓర్నీ... అవతల అన్నం మాడిపోతుంది. గింతంత కరివేపాకుంటే పారెయ్.. లచ్చుక్కో..." ఆ రెండిండ్ల మధ్యనున్న తాటాకుల దడి ఇవతల్నుండి లచ్చమ్మను కమలక్క పెనుకేకలు పెట్టినా లచ్చమ్మ కనీసం 'ఓ' అని కూడా మారుపలకదాయె! కమలక్క అన్నంకుండ దింపి లచ్చమ్మ తడికి దడి తోసుకుని లోపలికి పొయ్యేతలికి లచ్చమ్మ పడీ పడీ నవ్వసాగింది.

"ఓస్నీ... చెవుడానె... గంతలావున పిలిసినా సడిసప్పుడు చెయ్యవు. బాగనె వుంది సంబరం! గింత కరేపాకుంటే పడెయ్. పచ్చిపులుసు పిసుక్కోవాలి" కమలమ్మ మూతులూ చేతులూ అడ్డదిడ్డంగా తిప్పి నిష్టూరాలాడింది.

"అదే.. గదే... చూస్తివా కబురు... మాట... 'సమాచారం' అది చాలా ఇంపార్టెంటు... మొన్న మన మీటింగుల చెప్పిందేంది? మనకు ఏది వున్నా లేకపోయినా... తిండి లేకున్నా... నీళ్ళు దొరుక్కున్నా ఒంటిమీద చివరికి చింకిపాతలున్నా 'సమాచారం' చాలా ముఖ్యం! గదే... నా ఒంటిమీద కట్టుకోను సరైన కోక లేదు అని అర్జెంటుగా అందరికీ తెలిపిడి చేసేవి సమాచార విప్లవం – మన డ్వాక్రా గుంపంతా సమాచారాన్ని సేకరిస్తే సాలు! వెంటవెంటనే స్వర్ణాంధ్ర వచ్చేస్తుంది." లచ్చుక్క గుంపులీడరు కాబట్టి తన సాధికారితనంతా బయటకు సమాచారం ద్వారానే వెల్లడి చేస్తుంటే కమలక్క కంతా అయోమయమైపోయి నోరు వెళ్ళబెట్టింది.

"అవ్వొ... సమాచారం అంటే మాటలన్నమాట... మరి రోజూ మనం పనంతా అయినాక పందిట్లో... చింత చెట్టుకింద కూలబడి ఎన్నో కబుర్లు చెప్పుతుంటాం గదా! మరి స్వర్ణాంధ్ర ఆనవాల్లయితే అసలు కనబడ్డం లేదు – పొయిమీదకు కుండ ఎక్కడం మాత్రం కనాకష్టమైపోతుంది గదా!

లచ్చుక్క కమలమ్మను ఈసడింపుగా చూసి మటమటలాడింది "అదే.. కబుర్లు ముచ్చట్లు చెప్పుకునే రోజులు పోయాయి. సమాచార ఇప్లవం.. టెక్నాల్జీ... అసలు మన గ్రామాలలో ఎంతమంది ఏం చేస్తున్నారు. ఆదాయం ఎంత... ఏం చేయాలి... ఇట్లాంటి సమాచారం... మన పొరుగు జిల్లాలో... మండలంలో మన డ్వాక్రా మహిళలు ఏం చేస్తున్నారు... ఏం కూరలు వండుకుంటున్నారు... మనం ఏ కూరలు... పచ్చళ్ళు చేసి పంపిచ్చాలె... అబ్బో... ఇట్లాంటి విషయాలు మనం ఇండ్లలోనే మన కాళ్ళమీద మన కాళ్ళేసుకుని టింగుటింగుమని తెలుసుకోవచ్చు.. వాళ్ళకొచ్చే రోగాలు... పురుళ్ళు... పుణ్యాలు... బారసాలలు... మీటింగులు...

"అరె... గవి తెలుసుకుంటే మన కేంటి లాభం... ఎవలింట్లె వాండ్లు పురుడు పోసుకుంటరు – ఎవలకేది దొరికితే అది తింటరు – లేకపోతే నీళ్ళు తాగి పండుకుంటరు...!"

మళ్ళా లచ్చమ్మ లపలప నెత్తి బాదుకుని మండిపడ్డది. "అందుకే మీది మట్టి తలకాయ ఇన్ఫర్మేషన్ టెక్నాల్జీ మాటలు కాదు. సరెగాని కమల... మన చెంద్రబాబుగారు మనకందరికీ సెల్‌ఫోన్లిస్తుండుగాదె!'

"సెల్లుఫోన్లా..." కమలకు మూర్ఛవచ్చినంత పనయ్యింది. అది కొనుక్కోవాలంటే అయిదారువేల పైమాటే. పైగా నెలకు అయిదారు వందలన్నా దానికి కర్సు! అని మామయ్య జక్కులోడు చెప్పిండు గదా!

"రిలెన్సు బాబాయి ఏర్పాటు చేస్తుండు. ఒప్పందం అనుకో... రిలెన్సు అంకుల్‌కి మన బాబుగారు కోట్ల కోట్ల రూపాయల గవర్మెంటు జాగాలిస్తుండు. ఆయనగారు టవర్లు కట్టుకుని మనకీ సెల్‌ఫోన్లు పుణ్యానికే సప్లయి చేస్తండు...!"

కమలకు గుండె వేగంగా కొట్టుకుంది. డ్వాక్రా మహిళగా అవతారం ఎత్తడం కచ్చితంగా తన గత ఏడు జన్మల పుణ్యఫలమే తప్ప మరోటి కానేకాదు. అబ్బో... సొగ్గా చెవిదగ్గర దాన్ని ఆనించుకుని 'హలో... హలో' అని ఎవర్తోని బడితే వాళ్ళతోని... అబ్బ... ఎంత పుణ్యం చేసుకుని తామీ డ్వాక్రా మహిళ అవతారం ఎత్తినామో గదా... అబ్బా...! ఓహో....!!

* * *

"అహనా సెల్లంట... ఒహోనా సెల్లంట... మా చెల్లెమ్మ సెల్లంట... ఆహా... ఓహో...." యాద్గిరి ఓ గదిరింపు గదిరించడంతో జక్కులోడు చిందులు తొక్కడం ఆపాడు. "ఏందిర అదీ... ఆ ఎగురుడేందీ.... ఆఁ"!

"యాద్గిరన్నా... సెల్‌పోన్... మా డ్వాక్రా మహిళలకిచ్చింద్రు గదా... అబ్బా... ఎంత సొగసుగా వుందో..." జక్కులోడు సంబరంగా అన్నాడు. అప్పటికే రాచబీదిలో పైట కొంగుకాస్తా నడుంకు బిగించి లచ్చుక్క టీకు టాకుగా రావిచెట్టు చప్టా దగ్గరకు రానే వచ్చింది.

"రావమ్మా చెల్లెమ్మా... సెలుఫోను చెంద్రమ్మ...!" జక్కులోడు కూనిరాగం తీశాడు. లచ్చుక్క ముసిముసిగా నవ్వింది. "మొత్తం మనూర్లె ఎనిమిది గుంపుల్గాను వందమంది దాకా వున్నామన్నా.. మొత్తం అయిదుగురికి సెలుఫోన్లు పంపిచ్చిండు చంద్రన్న. అబ్బో... మిగిల్నోల్లందరూ బాగా డిపాజిట్లు చేయలేదంట! వాళ్ళకు మాత్రం ఓ ముప్పయి మందికి గాసుబండ లిచ్చింద్రు. మిగిల్నోల్లందరికీ పచ్చటోపీలు పంచింద్రు! ఇంగ మీటింగులకు వాట్ని పెట్టుకుని పోవాలె...

"యహె... అది కాదెసె... రివాల్వింగు ఫండు కింద మీ వాండ్లకు ఏమైనా డబ్బులు ముట్టినయా" అని యాద్గిరి అడగడంతో బిత్తరపోయిన లచ్చమ్మ తల అడ్డదిడ్డంగా వూపింది. యాద్గిరి ఫెళపెళ నవ్వాడు.

"ఏదీ.... ఇటుతేవే...!" అని ముచ్చటైన సెల్‌ఫోనందుకుని టకటక నాలుగైదు నెంబర్లు నొక్కంగనె అది వనువుపూసినట్లు పచ్చగా మెరిసిపోయింది. వెంటనే దాన్లో నుండి 'చెప్పండీ' అని ముఖ్యమంత్రి చెంద్రబాబుగారి భీకర గంభీర స్వరం... అట్లా 'చెప్పండీ' అని కచ్చితంగా దానంతటకదే విరామం తీసుకుని ఆరుసార్లు అన్న తర్వాత "మీ సమస్యను వెంటనే పరిష్కారం చేయమని అధికారులకు ఆదేశాలిస్తున్నానని తెలియజేసుకుంటున్నాను...." ట్రింగ్... ట్రింగ్...!! అని ఆగిపోయింది. యాద్గిరి విరగబడి నవ్వి మరో నెంబరు... ఇంకో నెంబరు ఎన్నిసార్లు... ఎన్ని మీటలు నొక్కినా దాన్లో నుండి కచ్చితంగా ఆరుసార్లు "చెప్పండీ" అనీ... చివరగా "మీస.... చేసుకుంటున్నాను" – అన్నమాటలే వినిపించడంతో లచ్చుక్క బిత్తరపోయింది. యాద్గిరి ప్రళయంగా నవ్వాడు.

"లచ్చుక్కా... ఈ సెల్‌ఫోన్లన్నీ ఒక కంపెనీ వాండ్లు స్పెషల్‌గా మీ కోసం తయారు చేసినవి... చేయించినవి... దీన్లో నుండి ఆ మూడు ముక్కలు తప్ప మరింకేం రావు... నువ్వు ఎవరితో మాట్లాడేటందుకు వీల్లేదు... ఏంలేదు... ఎటు తిప్పి మీటలు నొక్కినా గవే మాటలు... అక్కడ కంపూటర్లో లక్షల లక్షల ఫోన్లు ఇట్లాగే పలికేటట్లు కనెక్షన్లిచ్చిపారేసింద్రు... అంతే... అహహ్హహ్హా... మరికొద్ది నెలల్లో "మీరంతా నా విజయానికి హారతులు పట్టండనీ... మరింకేదో దాన్లో నుండి వస్తదే.. ఇది స్పెషల్ ఎలక్షన్ సెల్‌ఫోను...

లచ్చుమ్మ చప్టామీద కూలబడింది! ●

రక్త విరేచనాలు

మానవులలో రక్త విరేచనాలకు బ్యాక్టీరియా, అమీబా వంటి పరాన్నజీవులు కారణమవుతున్నాయి. బ్యాక్టీరియాలలో ముఖ్యంగా 'షిగెల్లా' అనే బ్యాక్టీరియా రక్త విరేచనాలకు కారణమవుతుంది. దీంతోబాటు ఇ.కోలై, విబ్రియో పారాహీమోలైటికస్, కాంపైలోబ్యాక్టర్ వంటివి కూడా రక్త విరేచనాలకు కారణం కావచ్చును. బ్యాక్టీరియా వల్ల కలిగే రక్త విరేచనాలను 'బాసిల్లరి డీసెంట్రీ' అంటారు. అలానే అమీబా వల్ల సంభవించే రక్త విరేచనాలను అమీబిక్ డీసెంట్రీ అంటారు.

బాసిల్లరి డీసెంట్రీ కారక బ్యాక్టీరియాను 1896లో జపాన్‌కు చెందిన షిగా అనే శాస్త్రవేత్త కనుగొన్నారు. అందువల్లనే ఆ బ్యాక్టీరియాకు 'షిగెల్లా' అనే పేరు పెట్టారు.

ఎలా వ్యాప్తి చెందుతుంది?

షిగెల్లా మనుషుల నుండి మనుషులకు ఓరల్ రూట్ (నోటి) ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుంది. షిగెల్లా బ్యాక్టీరియా వ్యాప్తిలో అపరిశుభ్రత కీలకపాత్ర వహిస్తుంది.

వ్యాప్తి చెందే విధానం

1. బాసిల్లరి డీసెంట్రీ బాధితుల చేతులు, వేళ్ళు శుభ్రంగా కడుగుకోకపోవడం వల్ల చేతుల ద్వారా నోటిలోకి ప్రవేశించడం
2. డోర్ హేండిల్స్, వాటర్ టాప్స్, వంట, భోజన పాత్రల ద్వారా
3. త్రాగు నీరు కలుషితం కావడం ద్వారా
4. ఆహార పదార్థాలు కలుషితం కావడం ద్వారా
5. ఈగల ద్వారా మెకానికల్ ట్రాన్స్‌మిషన్



కారణాలు

జీర్ణవ్యవస్థలోకి ప్రవేశించిన బ్యాక్టీరియా ముఖ్యంగా పెద్దప్రేగులోని ఎపిథీలియల్ కణాలలో ప్రవేశిస్తాయి. అక్కడ సంఖ్యాభివృద్ధి చెందుతూ ప్రేగు కుడ్యంలోకి చొచ్చుకుపోతాయి. ఫలితంగా అక్కడ ఇన్‌ఫ్లమేషన్ వస్తుంది. ఎఫెక్ట్ అయిన కణాలు నశిస్తాయి. అల్సర్లు ఏర్పడతాయి. కాపిల్లరి త్రాంబోసిస్ వస్తుంది. రక్తస్రావం మొదలవుతుంది. చాలా తక్కువ సంఖ్యలో అంటే 10 నుండి 100 బ్యాక్టీరియా డీసెంట్రీకి కారణం కాగలవు. వీటికి జీర్ణాశయంలోని గాస్ట్రిక్ ఎసిడిటీని తట్టుకునే శక్తి ఉంటుంది. ఇంక్యుబేషన్ పీరియడ్ చాలా తక్కువగా ఉంటుంది. ఒక్కోసారి 48 గంటలే ఉంటుంది. ఆయా వ్యక్తుల ఆరోగ్య పరిస్థితులను బట్టి గరిష్టంగా ఏడు రోజుల వరకు ఉండవచ్చును.

లక్షణాలు

విరేచనంలో రక్తం, బంక (మ్యూకస్) పడుతుంది. విరోచనంలో మల పదార్థం తక్కువగానూ, రక్తం ఎక్కువగానూ ఉంటాయి. దీనినే శాస్త్రీయ పరిభాషలో 'షిగెల్లోసిస్' అని కూడా అంటారు. ఇతర లక్షణాల విషయానికి వస్తే కడుపులో నొప్పి ఉంటుంది. జ్వరం రావచ్చును. వాంతులు కావచ్చును.

వ్యాధిని ఎలా నిర్ధారిస్తారు?

విరేచనంలో సూక్ష్మజీవుల (బ్యాక్టీరియాను) ఉనికిని గుర్తించడం ద్వారా వ్యాధిని నిర్ధారించ వచ్చును.

చికిత్స

నిజానికి బాసిల్లరి డీసెంట్రీ సెల్ఫ్ లిమిటింగ్ వ్యాధి. రెండు మూడు రోజులలో తగ్గిపోతుంది. శరీరం విరోచనం ద్వారా కోల్పోతున్న ద్రవాన్ని భర్తీ చేస్తూ ఉండాలి. రక్త విరేచనాలు కనిపించిన వెంటనే వైద్యుని సంప్రదించడం మంచిది. ●

పళ్ళు పీకిన లేదా ఊడిన రోజే కృత్రిమ దంతాలు అమర్చవచ్చు!



ఆధునిక దంత వైద్యం

డా|| పి.వి. పార్థసారధి

ఎవరికైన పన్ను ఊడిపోవడం లేదా రావడం ఓ దురదృష్టకర సంఘటన. నోట్లోనుంచి పన్ను తీసేయగానే ఎన్నో రకాల సమస్యలు ఎదురవుతాయి. ఇక తీసే పళ్ళు ముందువైతే వారి బాధ చెప్పనవసరం లేదు. పన్ను పీకిన తరువాత ఏమవుద్దో...ఏమో, కృత్రిమ దంతాలు ఎలా వుంటాయో అనే రకరకాల అనుమానాలతో ఎంత తప్పని సరైనా చాలా మంది పన్ను పీకించుకోవడం వాయిదా వేస్తూంటారు. దీనికి మరోకారణం పన్ను పీకిన నెల రోజుల తర్వాత గాని కృత్రిమ దంతాలు బిగించకూడదనే అపోహ చాలా మందిలో వుండటవే. ఇలా అంతెందుకు? ఈ రోజుకూడా చాలా మందిని అడిగితే పళ్ళు పీకిన కొన్ని నెలలవరకు అంటే గాయం పూర్తిగా మాని ఎముక గట్టిపడే దాకా పళ్ళు బిగించకూడదనే వాదిస్తారు! ఒక సారి ఊహించండి. ఉద్యోగస్తులుకాని లేదా వ్యాపారస్తులు కాని ముందు పన్ను తీయాల్సివస్తే ఒక నెలరోజులు పన్ను లేకుండా ఆఫీసుకు వెళ్ళగలరా? వ్యాపారం చేసుకోగలరా? అదే విధంగా వయస్సు మీరిన వారికి అన్ని పళ్ళు తీయాల్సి వచ్చినపుడు మూడు నెలల తరువాత పళ్ళు కదితే అప్పటి దాకా వారి ఆహారం సంగతేంటి? జీర్ణశక్తి తగ్గి ఆరోగ్యం పాడైపోదూ?

ముందు నుంచి చూపు

ప్రక్కనుంచి చూపు

పళ్ళు పీకేయగానే ముఖంలో వచ్చే మార్పులు

పన్ను పీకినా వెంటనే వచ్చే, సమస్యలెన్నో...

పన్ను పోగొట్టుకున్న నోట్లో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయి. ముందు పళ్ళయితే బయట తిరగడమే కష్టం. ఆత్మస్థైర్యం దెబ్బతింటుంది. దంతాలు పోగొట్టుకున్న వ్యక్తి మాటల్లో స్పష్టత లోపిస్తుంది. వీరు ఎదుటివారితో ఏమి మాట్లుడు తున్నారో అర్థం కాదు. ఇక దవడ పళ్ళుపోతే నమిలే శక్తిని కోల్పోతారు. ఒక సర్వే ఇలా చెబుతుంది. ఏదైనా దవడలోనుంచి ఒక పన్ను తీసేస్తే ఆ వ్యక్తి సుమారు 25 శాతం నమిలే శక్తిని కోల్పోతాడు. కొంతమందికి చిన్న వయస్సులో నే దంతాలు కోల్పోవడంతో ముఖంలో వచ్చే మార్పువల్ల దవడలు లొట్టపడి వయస్సు పైబడినవారిలా కనిపిస్తారు.

దంతవైద్యుడి కోణం నుంచి ఆలోచిస్తే ఊడిన లేదా తీసేసిన పళ్ళ స్థానంలో కృత్రిమ దంతాలు అమర్చకపోతే ఆ ఖాళీ ప్రదేశంలోకి మెల్ల మెల్లగా పక్కపళ్ళు, ఎదుటి దవడలోని పళ్ళు జరిగిపోయి పళ్ళన్ని అస్తవ్యస్తంగా తయారువుతాయి. దాంతో సమస్య మరింత జటిలమై మరిన్ని దంతాలను కోల్పోయే అవకాశంవుంది.

పంటిని తీసినరోజేకృత్రిమ దంతం అమర్చడం ఎలా?

ఏ కారణం చేతనైనా పన్ను పీకాల్సి వస్తే ముందుగా డాక్టర్ను కలిసిసమస్యను తెలియజేయాలి. డాక్టర్ పలానా రోజున పళ్ళు తీస్తామని చెప్పి ముందుగానే పెట్టబోయె పంటికోసం కొలతలు తీసుకుంటారు. తీసుకున్న కొలతల ప్రకారం లాబరేటరీలో కావాల్సిన విధంగా కృత్రిమ దంతాన్ని తయారు చేసుకుంటారు. అనుకున్న రోజు పన్ను పీకినవెంటనే కొన్ని గంటలు తరువాత ముందుగా తయారు చేసుకున్న కృత్రిమ దంతాన్ని బిగిస్తారు.

ఇలా పీకిన రోజునే కృత్రిమ దంతాలు అమర్చడం వల్ల లాభాలున్నాయి...

పీకించుకున్నవి ముందు పళ్ళయితే వెంటనే పెట్టడం వల్ల ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకునే వారికి సౌకర్యంగా వుంటుంది. చాలా మంది నోట్లో పన్ను తీయించుకున్నామని ఎదుటి వారికి తెలియకూడదనే కోరుకుంటారు. కొందరికైతే ముందు పళ్ళు తీయగానే ఉచ్చారణ లోపాలొస్తాయి. పన్ను అదేరోజు పెట్టడంతో ఇటువంటి ఇబ్బందికర పరిస్థితుల నుండి బయటపడవచ్చు. పన్ను పీకకముందు డాక్టరు కొలతలు తీసుకోవడంతో మార్చబోయే పంటి పొజిషన్ ,రంగును, ఆకారాన్ని,ఆకృతిని డాక్టరు ముందుగానే తెలుసుకుంటారు. గనుక కృత్రిమ దంతాల్ని కూడా వీలైనంత వరకు సహజ దంతాన్ని పోలివుండే విధంగా తయారుచేస్తాడు. అందువల్ల ఎదుటివారు దీన్ని గుర్తించే అవకాశమే వుండదు. హాస్పిటల్‌కి ఎలా నవ్వుతూ పోయామో అదే చిరునవ్వుతో బయటకు రావచ్చు. ఇక వెనుక పళ్ళయితే నమిలేశక్తి దెబ్బతినకుండా బయటపడవచ్చు. దవడ కండారాలకు సపోర్టు తగ్గి బుగ్గలు లొట్టపడతాయి. దీంతో ముఖంపై కూడా ముడతలొస్తాయి. ఇవి జరుగకుండా చూసుకోవచ్చు. పూర్తి పళ్ళు తీయాల్సి వచ్చి ఎక్కువ రోజులు వదిలేస్తే నాలుక సైజు పెరుగుతుంది. దీన్ని నివారించవచ్చు.

నోట్లోని మొత్తం పళ్ళని కూడా వెంటనే అమర్చవచ్చా?

ఇలా చేయడం కూడా శాస్త్రీయంగా ఎంతో ప్రోత్సహించ దగ్గ ప్రక్రియ. ఇందులో ఒక పద్ధతి ప్రకారం మొదట వెనుక పళ్ళను తీసివేస్తారు. చివరగా పళ్ళు బిగించే ముందు పళ్ళను కూడా తీసి సరైన కొలత తీసుకుంటారు. ఈ విధంగా నోట్లోని పళ్ళు అన్ని పూర్తిగా తీసేసిన మరుసటి రోజే పళ్ళ సెట్టు ఇవ్వడం వల్ల పేషంట్‌కు ఎన్నో రకాల సౌకర్యాలుంటాయి.

వీటిలో కొన్ని:-

నమిలే శక్తి పూర్తిగా కుంటుపడదు కనుక జీర్ణమవడం యథావిధిగా వుంటుంది. నోట్లో పళ్ళుండగానే కొలతలు తీసుకుంటాము కనుక దవడలు,కొరికే విధానం పళ్ళు ఉన్నప్పటి లాగానే తయారు చేసుకోవచ్చు. పళ్లు తీసిన వెంటనే సెట్టు పెడతాము కనుక కండరాలు బిగుతును కోల్పోవు. పేషంట్ సాంప్రదాయేతర నమిలే పద్ధతులకు అలవాటు పడడు. డెంచర్లు తొందరగానూ, సులభంగాను అలవాటౌతారు. ఈ విధంగా వెంటనే తయారు చేసిన డెంచర్లు గాయాలనుంచి రక్తస్రావం తగ్గించడంలోనూ, నెగటివ్ ప్రజర్ పడకుండా సహాయపడతాయి. దీంతో గాయం తొందరగా మానుతుంది. ఇంతకు ముందు పళ్ళలో సందులుండడం, వంకర తిరిగి వుండడం వంటి ఇబ్బందిపెట్టే సమస్యలుంటే వాటిని డెంచర్లో సరి చేసుకోవచ్చు. కాక పోతే ఇలా వెంటనే తయారైన పళ్ళ సెట్టును 2,3 నెలల తరువాత మళ్ళీ ఒక సారి రీలైనింగ్ లేదా రీబేసింగ్ అనే ప్రక్రియ ద్వారా సరి చేసుకోవాల్సి వుంటుంది.

ముందు నుంచి చూపు

ప్రక్కనుంచి చూపు

పీకిన పళ్ళ స్థానంలో కృత్రిమ దంతాలు బిగించిన తరువాత

పార్థ దంత వైద్యశాల & రీసెర్చి సెంటర్

పెద్దకాపు లేఅవుట్ - తిరుపతి.

రెక్కలు విరిగిన బ్రతుకుల ఘోష

'గ్లోబలైజేషన్ కథలు'

"తల్లిలాంటి భూమి తమది కాకుండా పోయాక మనసు బండబారిపోయింది ఏడ్పులు మామూలైపోయాయి. ఇప్పుడు కన్నీరుకూ కరువే!" నేటి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడకెళ్ళి వెతికినా రైతు పరిస్థితిని ఇంతకన్నా ఏమని చెప్పాలి? అందుకేనేమో గ్లోబలైజేషన్ ఎఫెక్ట్ రైతులపై ఎలా ఉందో ఒక్కొక్కరు ఒక్కో కోణంలో కథలు, కవితలు, తదితర రూపాల్లో అక్షరీకరించారు. ఎల్.పి.జి. (లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్) వలయంలో చిక్కుకున్న విధానాన్ని దైన్య స్థితిని చెప్పడంలోను, చూడడంలోనూ, మనస్సులను కుదిపే భాషను (ఎల్.పి.జి.ని సమర్థించుకొనే వాళ్ళ విషయం అటుంచండి) వాడారు అనేకానేక మంది రచయితలు. అలాంటి వారి కథల్ని ఎంపిక చేసి 'విశాలాంధ్ర' వారు 'గ్లోబలైజేషన్ కథలు' పేరుతో పుస్తకంగా తీసుకొచ్చారు. ఎస్.వి. సత్యనారాయణ సంపాదకుడుగా మరో మంచి పని చేశారనిపిస్తుంది ఈ పుస్తకాలలోని కథల్ని చదివిన తర్వాత.

దీనిలో మొత్తం కథలు ఎన్ని? అన్న విషయానికి ప్రాధాన్యత ఇవ్వడం కన్నా ఎన్ని జీవిత కోణాల్ని చూపించిందో ఆలోచించడం ప్రధానం. రైతుల దుర్భర దుస్థితిపై పెద్దింటి అశోక్ కుమార్ (కీలుబొమ్మలు) కథ పరిపూర్ణ ప్రతిబింబాన్నిచ్చేట్లుంది.



గ్లోబలైజేషన్ కథలు
సంపాదకుడు : డా॥ ఎస్వీ సత్యనారాయణ; **పేజీలు :** 130; **వెల :** రూ.50/-; **ప్రతులకు :** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలు

ఓల్గా తన కథలోని (కోకాకోలా) పాత్రలను ప్రవేశపెట్టిన తీరు పాఠకున్ని ఆలోచింప చేసేవిగా వున్నాయి. ఈ కథలోని పాత్రలు మాట్లాడే మాటలు పాఠకుని చెవుల్లో 'రింగులు' తిరుగుతాయి. "అందరం యుద్ధరంగంలోనే వున్నాం" అనే మాట నేటి ప్రపంచ దేశాల అభద్రతా భావాన్ని గుర్తుకు తెస్తుంది. అమెరికా సామ్రాజ్యవాదాన్ని విప్పి చెప్పడంలో 'ఓల్గా'ది ఓ ప్రత్యేకమైన శైలి. పప్పుసుద్ద (జాతశ్రీ) కథలో అవతారం, వెంకటేశం పాత్రల మధ్య సాగే సంభాషణ చదువుతున్న పాఠకుడు తానే తన మిత్రునితో మాట్లాడుతున్నట్లు, ఎవరో బాగా తెలిసిన వ్యక్తి జీవితం గురించి చెప్తున్నట్లు ఫీలవుతాడు. "ప్రపంచం-దగ్గరై కుటుంబాలు దూరమవుతున్న రోజులివి! ఇంకా ఎందుకీ అనుబంధాలూ, ఆరాటాలు." గ్లోబలైజేషన్ వ్యక్తిగత జీవితాల్ని ఎంత అతలాకుతలం చేస్తుందో ఒకే ఒక్కమాటలో చెప్పడం 'జాతశ్రీ'కే చెల్లును.

'ఇవాళ' (జయంతి పాపారావు) కథ చిన్నదిగానూ వ్యంగ్యం నిండిన సెటైర్‌గా ఉండటం పాఠకున్ని లోలోతుల్లోకి తీసుకెళ్తుంది.

ప్రపంచంలో కొన్ని శక్తులు పెత్తనం కోసం చిన్న చిన్న దేశాలపై చూపే తమ జులుంను అన్ని కోణాల్లోనూ చూపెట్టగలిగిన కథలు మానవుల్లోని మమతలు మాసిపోవడంలోని వైపరీత్యాన్నీ, పరిణామ క్రమాన్నీ తెలపకపోవడం వల్ల పాఠకుడు అసంతృప్తికి లోనయ్యే పరిస్థితి ఉంది. ఆ క్రమంలో రాసిన ఒకటి రెండు కథల్ని చేర్చితే బాగుండేదనిపిస్తుంది. ఈ విషయంలో ఒకటికి రెండు సార్లు 'ఊరికి పోదాం భూదేవీ!' కథ చదివి పాఠకుడు తృప్తి చెందుతాడనడంలో సందేహం లేదు. ●

స్వీకారం



అందాల పార్కు అతి మంచి పిల్లి
సంకలనం, కథనం : కె.అంజన; **వెల :** రూ. 15/-; **ప్రతులకు :** ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు



విదేశీ కథలు
సంకలనం, కథనం : డా॥ కాకర్లమూడి విజయ్ **వెల :** రూ. 15/-; **ప్రతులకు :** ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు

మతం-రాజకీయాలు-టీవీ
రచన : అరవింద్ రాజగోపాల్ **వెల :** రూ. 8/-; **ప్రతులకు :** ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు



విలియం షేక్స్పియర్
సంకలనం, కథనం : వివేక్; **వెల :** రూ. 15/-; **ప్రతులకు :** ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు

పిల్లల గణితం
రచన : ఇ.చంద్రయ్య **వెల :** రూ. 15/-; **ప్రతులకు :** ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు



ఆలయాల జిల్లా మహబూబ్‌నగర్



పిల్లలమర్రి

పురాతన ఆలయాలు, ప్రసిద్ధి చెందిన పిల్లలమర్రిచెట్టు, సరస్సులు, రిజర్వాయర్‌లు గద్వాల నేతచీరెలకు పేరెన్నికగన్న మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యాటకులకు కనవిందు చేసే ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి.



ఆలంపూర్

కర్నూల్ జిల్లాలో గల శ్రీశైలం మల్లిఖార్జున ఆలయానికి వెళ్ళే నాలుగు మార్గాల్లో ఆలంపూర్ ఆలయం ఒకటని ప్రతీతి. తుంగభద్ర నది ఎడమగట్టుపై గల ఆలంపూర్‌లోని నవబ్రహ్మల ఆలయం చాలా ప్రసిద్ధి చెందింది. చాళుక్యుల కాలంలో ఈ తొమ్మిది బ్రహ్మల ఆలయాలను నిర్మించారు. ఆలయంలోని దేవతల విగ్రహాలు వివిధ రూపాలు, భంగిమల్లో అద్భుత కళాసృష్టికి నిదర్శనంగా నిలుస్తాయి. ఆలంపూర్‌కి 1.6 కిలోమీటర్ల దూరంలో గల పాపనాశంలోని 20 ఆలయాల సముదాయం కూడా పర్యాటకులను విపరీతంగా ఆకర్షిస్తుంది. ఆలంపూర్ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కి 217 కిలోమీటర్ల దూరంలో, మహబూబ్‌నగర్‌కి 130 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

పిల్లలమర్రి

మహబూబ్‌నగర్ పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో 3 ఎకరాల స్థలంలో విస్తరించి ఉన్న పిల్లలమర్రిని పర్యాటకులు ఎంతో ఆసక్తిగా చూస్తారు. ఈ చెట్టుకింద ఒక ముస్లిం ప్రవక్త సమాధి ఉంటుంది. దూరం నుండి ఈ చెట్టును చూస్తే ఒక పచ్చటి గొడుగు మాదిరిగా కనిపిస్తుంది. దీనికింద ఒకేసారి వెయ్యిమంది తలదాచుకోవచ్చు. 700 సంవత్సరాల క్రితందిగా భావిస్తున్న ఈ చెట్టు ఊడలు శాఖోపశాఖలుగా విస్తరించి ఉన్నందున పిల్లలమర్రిగా పేరు వచ్చింది. దీనికి సమీపంలో ఒకచిన్న జంతుప్రదర్శనశాల, ఆక్వేరియం, పురాతత్వశాఖ మ్యూజియం కూడా ఉన్నాయి. పిల్లలమర్రి చెట్టు పల్లపుప్రాంతంలో ఉండటం వల్ల వర్షాకాలంలో ఇక్కడ చెరువులా తయారవుతుంది. అందువల్ల పర్యాటకుల కోసం వర్షాకాలంలో బోట్ షికార్ ఏర్పాటుచేస్తారు.

జెటప్రోలు

కొల్లాపూర్‌కు 9 కిలోమీటర్ల దూరంలో, మహబూబ్‌నగర్‌కు 158 కిలోమీటర్ల దూరంలో గల జెటప్రోలులో గల ఆగస్త్యేశ్వర ఆలయాన్ని పదవ శతాబ్దంలో నిర్మించారు. ఈ ఆలయం వద్ద మహాశివరాత్రి, కార్తీకపౌర్ణమి వంటి పండుగలను పెద్దఎత్తున నిర్వహిస్తారు. శ్రీశైలం రిజర్వాయర్ నిర్మించే సమయంలో ఈ ఆలయాన్ని జెటప్రోలుకు తరలించారు. రిజర్వాయర్ వల్ల కొన్ని గ్రామాలు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉండటం వల్ల ఆలయాన్ని ఎలా ఉన్నది అలా జాగ్రత్తగా తరలించి పునర్నిర్మించారు.



అలంపూర్ సంగమేశ్వర దేవాలయం

శ్రీరంగాపూర్

మహబూబ్‌నగర్‌కి 100 కిలోమీటర్ల దూరంలో గల శ్రీరంగాపూర్‌లోని రంగనాయకస్వామి ఆలయాన్ని శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించారు. రంగనాయకస్వామి రాయలు కలలోకి వచ్చి చెప్పినపిమ్మట ఆయన ఈ ఆలయాన్ని నిర్మించారని చెబుతారు. జిల్లాలో రెండవ పెద్ద చెరువుగా పేరుపొందిన రత్నపుష్కర్ని సరస్సు ఒడ్డున ఈ ఆలయం ఉంది.

కొల్లాపూర్

కొల్లాపూర్‌లోని మాంచాల కట్ట వద్ద మాధవస్వామి ఆలయాన్ని జెటప్రోలు రాజులు 16వ శతాబ్దంలో నిర్మించారు. ఆలయ గోడలు అద్భుతశిల్పాలతో అలరారుతాయి. 24 భంగిమల్లో శ్రీమహావిష్ణువు రూపాలు, దశావతారాలు గోడలపై అందంగా చెక్కారు. ఈ ఆలయాన్ని కూడా శ్రీశైలం రిజర్వాయర్ కారణంగా ముంపునకు గురికాకుండా మాంచాలకట్ట నుండి కొల్లాపూర్‌కి తరలించి పునర్నిర్మించారు.

గద్వాల చీరెలు

కర్నూల్‌కు 60 కిలోమీటర్ల దూరంలోగల గద్వాల చేనేత చీరెలకు ప్రసిద్ధి గాంచింది. 17వ శతాబ్దంలో గద్వాల రాజులు ఈ పట్టణంలో నిర్మించిన చెన్నకేశవ ఆలయం పర్యాటకులను బాగా ఆకర్షిస్తుంది. గద్వాలకు 20 కిలోమీటర్ల దూరంలో కరుమర్తిలోని కొండపైగల వెంకటేశ్వర ఆలయం పేదప్రజల తిరుపతిగా పూజలు అందుకుంటోంది. గద్వాల చీరెల దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. ●

✻ హెచ్.రమేష్ బాబు



హిందీ చిత్ర రంగ స్వరకర్త 'సి.రామచంద్ర'

జనవరి 12న 86వ జయంతి



హిందీ చిత్రసీమను నాలుగు దశాబ్దాల పాటు తన సుమధుర స్వరాలతో చకచ్ఛకితం చేసిన వారు 'సి.రామచంద్ర'. అంతా "అణ్ణా సాహెబ్"గా, సన్నిహితులు 'అణ్ణా'గా పిలుచుకునే సి.రామచంద్ర సినీ సంగీతంలో మూడు తరాలకు ప్రాతినిధ్యం వహించారు. ఒక దశలో హిందీ సినీ సంగీతానికి మొగలాయిగా నిలిచారు. తన సమకాలికుడు నౌషద్‌కి సమాంతరంగా సినీ సంగీతాభిమానులను తన స్వరాలతో అలరించారాయన.

హిందీలో ఎంతో ఖ్యాతిగాంచిన సి.రామచంద్ర మొట్టమొదటిసారిగా సంగీతం చేసిన చిత్రం 'జయకోడి' (1939). అదీ తమిళంలో. ఆ తరువాత 'వనమోహిని'కి. మళ్ళీ 70వ దశకారంభంలో 'పొట్ట్రోను కేట్టెన్'కు సంగీతం అందించారు. చిన్ననాటి స్నేహితుడు భగవాన్ తీసిన 'సుఖజీవన్' (1941) సంగీత దర్శకత్వం నెరిపిన తొలి హిందీ చిత్రం. కాలక్రమంలో భగవాన్ హీరోగా ఫ్లాప్ అయినా సి.రామచంద్ర సంగీత దర్శకుడుగా సక్సెస్ అయ్యారు.

మహారాష్ట్రలోని అహ్మదాబాద్ జిల్లా చిత్‌లీ దగ్గరలోని పుణతంబెలో 1918 జనవరి 12న జన్మించిన సి.రామచంద్ర తన ఊరిపేరుతోనే చితల్కర్‌గా కూడా గాయకునిగా, సంగీత దర్శకునిగా పని చేశారు. డెంగర్‌గఢ్‌లో ఆయన బాల్యం గడిచింది. నాగపూర్‌కు చెందిన శంకర్‌రావ్ సప్రే వద్ద శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. పసితనం నుండి సినిమాలంటే అభిమానం పెంచుకుని చదువును గాలికొదిలేశారు. సినిమా హీరో కావాలనుకున్నారు. ఇంట్లోవాళ్ళు ఈ పట్టుదలను గుర్తించి కొల్హాపూర్ వెళ్తానంటే అభ్యంతర పెట్టలేదు. 17 ఏళ్ళ వయసులో 'నాగానంద' చిత్రంలో హీరోగా నటించారాయన. అయితే సినిమా ఫెయిలవడంతో కొల్హాపూర్ నుండి బొంబాయి చేరుకున్నారు. బొంబాయిలో సోహ్రాబ్ మోడి మినర్వా టాకీసులో చేరి చిన్న, పెద్ద అంటూ చేయని పనిలేదు. ఒకరోజు సోహ్రాబ్ మోడి పిలిచి మ్యూజిక్ డిపార్ట్‌మెంట్‌లో పని చేయమన్నాడు. ప్రతిష్టాకరమైన 'పుకార్' చిత్రానికి సహాయ సంగీత దర్శకుడిగా పని చేశాడు. మరికొన్ని చిత్రాల్లోని బృందగీతాల్లో గొంతు కలిపారాయన.

సి.రామచంద్ర 1947 నాటికి హిట్ మ్యూజిక్ డైరెక్టర్ స్థాయికి చేరుకున్నారు. షెహనాయ్ చిత్రం పొందిన ప్రజాదరణ సి.రామచంద్ర ఇంటిముందు నిర్మాతలు క్యూ కట్టేలా చేసింది. పాశ్చాత్య సంగీతాన్ని కరుణతో కూర్చి మీనాకపూర్‌తో కలిసి పాడిన "ఆనా మేరీ జాన్ సండేకీ సండే" పాట ఇప్పటికీ మెలోడియస్ గీతమే. 'బడ్‌తీజవానీ', 'జవానీకి రేల్' పాటలు ఈ చిత్రంలోనివే. ఇంకా ఖిడ్కీ (1948), పతంగా, సాజన్ (1949), అల్బేలా (1951), సుభాకాతారా, నాస్తిక్ (1954), అనార్కలి, అజాద్ (1955), రాజ్‌తిలక్ (1958), నవ్‌రంగ్ (1959) వంటి చిత్రాల సంగీతం సి.రామచంద్రను హిమాలయశృంగంపై నిలిపింది.

సి.రామచంద్ర సంగీతంలో ఆణిముత్యాలనదగిన పాటలు పాడి ఎదిగిన గాయని లతామంగేష్కర్. రామచంద్ర సంగీతం, లతా గాన వైదుష్యాల గురించి ప్రత్యేకంగా పరిశీలిస్తే చాలా విషయాలు బోధపడతాయి. సి.రామచంద్ర తరచూ అనేవారు 'తానే లతను గాయనిగా రూపొందించానని. తొలిదశలో ఎస్.ముఖర్జీ లత సున్నితమైన స్వరాన్ని వ్యతిరేకించినా ఈయన పట్టుదలతో ఆమెతో పాడించి మెప్పుపొందారు. జబ్‌దిల్‌కో సతాయే గమ్‌తూ ఛోడ్ సఖీ సర్‌గమ్ (సరిగమ్), ఓ పాస్ ఆ రహేహై హమ్ దూర్ జా రహేహై (సమాధి), యహ్‌జిందగీ ఉసీకిహై (అనార్కలి) వంటి ఎవర్‌గ్రీన్ సాంగ్స్ లత-సి.ఆర్.ల కాంబినేషన్‌ను గుర్తుకు తెస్తాయి. కాలక్రమంలో లత-సి.ఆర్. సంగీతంలో పాడటం మానేసిన తరువాత దాదాపుగా హిట్స్ లేకుండా పోయాయి. కానీ ఈ విషయాన్ని అంగీకరించక లత తనను గురించి తానేమనుకుంటుందో. ఆమెను నేను మలిచాను. ఆమె వల్ల నేను ఎదగలేదు. ఆమె పాడక మునుపే నేను అమీర్‌బాయి, షంషాద్‌బేగం, లలిదా దేవుల్కర్ వంటి వారిచే పాడించి నన్ను నేను నిరూపించుకున్నవాడిని" అనేవారు. ఇది నిజమే. వారంతా ఈయన సంగీతంలోనే రాణించారు. వీరికాలంలో లతా చేత పాడించారు కూడా. కానీ ఆ పాటలు లెక్కలోకి తీసుకోదగనివిగానే ఉండిపోయాయి.

కానీ కాలక్రమంలో పరిస్థితి మారనారంభించింది. సి.రామచంద్ర సంగీతంలో లత ప్రాధాన్యత పెరగడం మొదలైంది. అప్పటిదాకా పాడిన గాయనులందరినీ దూరం చేశారాయన. లలితా దేవూల్కర్, షంషాద్‌బేగంలు వచ్చి అడిగినా అవకాశమివ్వలేదాయన. కారణం అన్ని పాటలూ లతా చేతనే పాడించటం, ఇంతలో సుప్రసిద్ధ దర్శక నిర్మాత వి.శాంతారాం తాను తీయబోయే 'పర్‌ఛాయి'కి సంగీతం చేయవలసిందిగా ఆహ్వానించారు. ఇందులో శాంతారాం పత్ని జయశ్రీ నాయిక. ఆమె గాయక నటి. అయినా సరే జయశ్రీకి లతాచే పాడించేట్లయితేనే సంగీతం చేస్తానన్నారు. అప్పటికి ఆయన డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని శాంతారాం సరేనన్నారు. దీంతో జయశ్రీ పాడటం పూర్తిగా ఆగిపోయింది.

లతను ఎక్కువగా పాడించడం సి.రామచంద్రకు ఎంతగా కలిసి వచ్చిందో అంతే నిష్పత్తిలో నష్టాన్ని కలుగజేసి కెరీర్‌ను పతనం చేసింది. ప్రారంభంలో ఆయన చేసిన పాటలన్నీ తేలికగా, అలవోకగా ఉండేవి. 'షెహనాయ్'లోని 'ఆనామేరి జాన్ సండేకి సండే' హిట్ అవడంతో ఈయనపై పాశ్చాత్య ట్యూన్స్ చేసేవాడిగా ముద్రపడింది. శాస్త్రీయ సంగీతం బాగా తెలిసిన సి.ఆర్.కి ఈ ముద్ర లత గానంతో తుడిచిపెట్టుకుపోయింది. 'సర్‌గమ్'లో పాశ్చాత్య శైలిలో 'మైహూ ఏక్ ఖలాసీ మేరానామ్ హై భీమ్ పలాసీ' అని, మరోవైపు 'జబ్‌దిల్‌కో సతాయేగమ్ తూ ఛోడ్ సఖా సర్‌గమ్' వంటి భావుక గీతాన్ని లతతో కంపోజ్ చేశారాయన. 'అషా'లో ఒకవైపు 'ఇనమీ నడికా'తో ఉర్రూతలూగిస్తూనే మరోవైపు 'చంధనియా అర్జ్ కరే' అంటూ మెలోడిని వినిపించారు.

నెహ్రూను కంటతడిపెట్టించిన 'ఏ మేరే వతన్ కె లోగో' పాటను మొదట ఆషాచే పాడించేందుకు ప్రాక్టీసు కూడా జరిగింది. కానీ చివరి దశలో నిర్ణయం మారి ఒకే ఒక రిహార్సల్ జరిగి లతాచే పాడించి మెప్పు పొందారాయన. ఎందుకంటే ఈ పాటకు ఆయన లతను దృష్టిలో ఉంచుకునే స్వరాలు కంపోజ్ చేయడం, ఆమే పాడటం వల్ల ఆ పాట అంత గొప్పగా తయారైంది. అయితే అప్పటికే సి.ఆర్. సినిమాల నుండి దూరమయ్యారు. కానీ లత పాడేసరికి ఆ పాటకు జీవం వచ్చింది. అయితే తర్వాత ఇండో-పాక్ యుద్ధ సమయంలో ఢిల్లీలో శాస్త్రీజీ సమక్షంలో ఇదే పాటను పాడాల్సి ఉండగా లత పాడనంది. తప్పదని ఆషాచే

పాడించారు. కానీ ఫ్లాప్ అయింది. కారణం లతకు తప్ప మరొకరికి కంపోజ్ చేయలేకపోవడం. దీంతో సంగీత దర్శకుడుగా ఆయన వెనకబడ్డారు.

దగ్గరి వారు ఎప్పుడైనా 'లతగానం మీ ప్రతిభ, సంగీతాలను పనికి రాకుండా చేశాయంటే' అహం అడ్డొచ్చి వారి వాదనను అంగీకరించక 'లతను నేను రూపొందించాను. అయినా సినీ సంగీతంలో మొదటి స్థానం కవిది. కవి మంచి భావంతో రాస్తే సంగీతకారుడు గొప్ప స్వరాలు కూరుస్తారు. అతనిది రెండోస్థానం. ఈ సమ్మేళనాన్ని పాడే గాయనీ గాయకులది మూడోస్థానం అంటే వీరు టేప్‌రికార్డర్ లాంటి వారే. ఈ టేప్‌రికార్డర్లలో కొన్ని మంచివి కొన్ని చెడ్డవి ఉంటాయి. వాటిలో లత "షీ ఈజ్ గుడ్ టేప్ రికార్డర్" అన్నారు. ఇదంతా లతను తాను గాయనిగా మలిచాననే భావనతో అన్నారు.

అయితే చివరి దశలో ఈయన ట్రెండ్ అంతరించింది. లత పాడకపోవడం వల్ల ఆయన సంగీతం పరాజయం పాలైంది. ఆ దశలోనూ ఆయన "తన పాటల్లో లత పాడిన వాటిని వేరెవరూ పాడి మెప్పించలేరని ప్రకటించే వారు. లత దూరం కావడం తన సంగీతానికి గొడ్డలి పెట్టుగా భావించారు. చివరి రోజుల్లో తన కోసం లత పాడిన పాటలు వింటూ గడిపేవారు. 'సిపాహియా' కోసం లత పాడిన "ఏ అంఖ్ అబ్ తుమ్ న రోనా రోనాతో ఉమ్ భర్ హై" పాట విన్నప్పుడల్లా భావావేశంతో ఆయన కళ్ళు అశ్రువులతో నిండేది.

అన్నట్లు సి.రామచంద్ర తెలుగులో 'విజయకోట వీరుడు (1958), 'నిజం చెబితే నమ్మరు (1973), 'అక్బర్ సలీం అనార్కలీ' (1978) చిత్రాలకు సంగీతం అందించారు. చివరి రోజుల్లో చిన్న చిన్న చిత్రాలకు పని చేస్తూ గడిపారు. అధిక మద్యపానం వల్ల అల్సర్, మధుమేహ వ్యాధులతో బాధపడుతూ 1982 జనవరి 5న బొంబాయిలోని కె.ఇ.ఎం. హాస్పిటల్‌లో మరణించారు. సినీ సంగీతంలో వైతాళికుడుగా పేరొందిన సి.రామచంద్ర హిందీ గీతాల అభిమానులకు సదాగుర్తుంటారు. ●



ధ్వన్యనుకరణలో వైవిధ్యం కోసం తపన

ధ్వన్యనుకరణ (మిమిక్రీ) కళలో వైవిధ్యం కోసం తపన పడుతూ దానికోసం నిరంతర సాధన చేసే కళాకారుడు జెసి శేఖర్. సాధారణంగా ఈ ప్రక్రియలో కళాకారులు ప్రముఖుల కంఠాలను అనుకరించి ప్రేక్షకులను మెప్పించే ప్రయత్నం చేస్తుంటారు. అయితే పదేళ్ళ వయసు నుండే ఈ కళపై మక్కువ పెంచుకున్న శేఖర్ ఏ కళాకారులు అనుకరించని భిన్నమైన కంఠాలను అనుకరించే ప్రయత్నం చేశానని చెబుతున్నారు. నాటి సిఎస్ఆర్ పేరు చెబితే మాయా బజార్ సినిమాలో శకుని పాత్ర మనకు ఠక్కున గుర్తొస్తుంది. ఒక రకమైన కీచుగొంతు మాదిరిగా వుండే ఆ కంఠస్వరాన్ని అనుకరించిన కళాకారులు బహుకొద్దిమంది మాత్రమే. ఇలా సిఎస్ఆర్ వంటి అరుదైన కంఠాలను అనుకరించటం ప్రారంభించిన తను ఇప్పటి ప్రముఖ నటుల కంఠాలను సైతం అలవోకగా అనుకరించే స్థితికి చేరానని అంటారు. ప్రముఖ మిమిక్రీ కళాకారులు నేరెళ్ళ వేణుమాధవ్, శ్రీనివాస్‌లకు ఏకలవ్య శిష్యుడైన శేఖర్ స్వయం కృషితోనే ఈ కళలో పట్టు సాధించటం విశేషం. పదో తరగతి చదివే రోజుల్లో స్కూల్ వార్షికోత్సవంలో తొలి ప్రదర్శన ఇచ్చి అరంగేట్రం చేసిన ఈ కళాకారుడు ఇప్పటి వరకు 1500కు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. 1995లో అమూల్యా హోమ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ మిమిక్రీ ఫెస్టివల్‌లో ప్రథమ బహుమతి గెల్చుకున్న శేఖర్ 1995 ఏప్రిల్, 1997 మే నెలల్లో రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ, పర్యాటక శాఖలు సంయుక్తంగా నిర్వహించిన మ్యాజిక్, మిమిక్రీ, మైమ్ ఫెస్టివల్ 'మాయా వినోదం'లో పాల్గొని ప్రముఖుల దృష్టిలో పడ్డారు. 2001 డిసెంబర్ నెలలో జరిగిన సమైక్య భారతి ఐదవ వార్షికోత్సవ కార్యక్రమాలలో ఒక నిముషంలో 20 మంది కంఠాలను అనుకరించి పలువురి ప్రశంసలను అందుకున్నాడు. అదే సంవత్సరం రిలీజైన ఎన్‌టిఆర్ నగర్ సినిమాలో చిరంజీవికి డూప్‌గా నటించిన ప్రముఖ నటుడు రాజ్‌కుమార్, వెంకటేష్, బాలకృష్ణ, నాగార్జునలకు డూప్‌లుగా నటించిన నటులకు ఏక కాలంలో డబ్బింగ్ చెప్పటమే కాక అదే చిత్రంలో మరికొన్ని పాత్రలకు కూడా కంఠాన్ని అందించాడు. గత ఏడాది లోక్‌సత్తా రూపొందించిన నేటి భారతం అనే ఆడియో క్యాసెట్ అత్యంత ప్రజాదరణ పొందింది. ఒక మంచి డబ్బింగ్ కళాకారుడిగా రాణించాలనేది తన ఆశయం అంటున్న ఈ కళాకారుడు ప్రస్తుతం రామోజీ ఫిల్మ్‌సిటీలో మిమిక్రీ ఆర్టిస్టుగా సందర్శకులను అలరిస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. జెసి శేఖర్ అనబడే జమలాపురం చంద్రశేఖర్‌కు మరి బెస్టాఫ్ లక్ చెబుదామా?

- వి.వరప్రసాద్

కుంతీదేవి వారసులు

కన్నబిడ్డ కుంతీదేవిని మరిపించాడు
మూటకట్టి వృద్ధాశ్రమంలో జారవిడిచాడు
పండిన తలలు ఆశ్రమం నిండి వున్నాయి
కాండంలేని తలలు
కాడలు లేని తలలు
రెమ్మలు లేని తలలు
ఏ తల్లిని కదిలించినా
ఒకరు గంగలా కరుగుతారు
ఒకరు అగ్నిలా మారతారు
ఒకరు బేలగా పలుకుతారు
అన్నిటికి కేంద్ర బిందువు
కన్న కొడుకై నిలుస్తాడు!
ఆది కవి నుండి అడిగోపుల దాకా
అమ్మను గూర్చి అభివర్ణించారు
భూదేవికే ఓర్పునేర్పుతుందని ఒకరు
పగలు రాత్రి ప్రాణయంత్రమని ఒకరు
విద్యాబుద్ధులకు విశ్వవిద్యాలయమని ఒకరు
సువర్లోకాన్ని మించిన
మహర్లోకమని మరొకరు-

స్త్రీకి బాల్యంలో తండ్రి
యవ్వనంలో భర్త
వృద్ధాప్యంలో వృద్ధాశ్రమమని
నాటి నానుడికి నేడు
సవరణ చెయ్యాల్సి వుంది!
రెండు క్షణాలు తల్లి ఎడమైతే
అద్దాల నాడు గుక్కపెట్టిన బిడ్డ
గెడ్డాల నాడు తల్లికి
ఎడమై పారిపోయాడు!
తల్లీ బిడ్డ ప్రేమ ఎప్పుడూ
సమ తులాభారం తూగదు
పేగు తెంచుకుని
పెరిగిన వాడు బిడ్డ
తెగిన పేగు తల్లి కడుపున నిల్చి
పేగులు వున్నంత కాలం ప్రేమ చిరజీవకం!
మమ్మల్ని చూస్తే
కన్నబిడ్డలకే కాదు
యమభటులకూ భయమే!
కడుపు చీల్చుకు పుట్టిన బిడ్డలు
కడుపు కాల్చుకు తింటారని తెలిసినా
కనకుండా ఏ తల్లీ వుండదు!

- అడిగోపుల వెంకటరత్నమ్

ADVOCATE న్యాయసలహాలు

ఫోర్జరీ నోటు సృష్టించారు

నేను ఒకరి దగ్గర డబ్బులు తీసుకుని తిరిగి ఇచ్చాను. అతను ప్రామిసరి నోటు ఇస్తానని ఇవ్వకుండా నాపై ఫోర్జరీ సంతకంతో రు.70 వేలకు కేసు వేసినాడు. కాని నేను ఎలాంటి సంతకం చేయలేదు. నేను అతనిపై కేసు వేయవచ్చా ?

– శ్యామ్, గోపాలపురం.

మీరు చిన్న ప్రశ్నలోనే మూడు విధాలుగా చెబుతున్నారు. (1) డబ్బు తీసుకున్నాను. తిరిగి ఇచ్చాను. ప్రామిసరీ నోటు ఇస్తానని ఇవ్వలేదు అన్నారు. అంటే మీరు డబ్బు తీసుకున్నప్పుడు ప్రామిసరీ నోటు రాసిచ్చారనే కదా దీనర్థం. (2) ఫోర్జరీ సంతకం అంటున్నారు. మీ సంతకాన్ని మీరు ఆ ప్రామిసరీ నోటుపై పెట్టి ఉంటే అది ఫోర్జరీ కాదు కదా! (3) మీరు ఎలాంటి సంతకం చేయలేదు అంటున్నారు. అంటే మీరు మీకు అతడు ఇవ్వలేదు అని చెప్పే ప్రామిసరీ నోటు మాటేమిటి? మీరు ముందుగా ఆ డబ్బులు తీసుకునే నాడు మీరేం చేశారు అనేది గుర్తుకు తెచ్చుకుని ఓ నిర్ణయానికి రండి. కోర్టు నోటీసు వచ్చిందంటున్నారు. కాబట్టి మీరు ఆ రోజు తప్పకుండా కోర్టుకు హాజరుకండి లేదంటే అది మీ పరోక్షంలో అతడికి తీర్పునిస్తుంది.

మీరు చెప్పినట్లు అది 'ఫోర్జరీ' సంతకం అయితే మీరు కోర్టులో ఎవిడెన్స్ యాక్ట్ సెక్షన్ 45 కింద పిటిషన్ వేసి 'ఎక్స్‌పర్ట్ ఎవిడెన్స్' కోసం లాబ్‌కు పంపించమని అడగండి దాంట్లో మీ సంతకం కాదని తెలిస్తే కేసు నిలబడదు. అప్పుడు మీరు కేసు వేయవచ్చు.

నష్టపరిహారం ఒకేసారి రావాలంటే ఎలా ?

7-5-2002 తేదీన యాక్సిడెంట్ అయ్యింది. 3 నెలల తర్వాత ప్రైవేటు లాయర్ ద్వారా కోర్టులో కేసు వేశాము. తర్వాత **9-11-2002** లోక్‌అదాలత్‌లో పెట్టాము. తద్వారా లక్ష రూపాయల వరకు శాంక్షన్ అయ్యింది. తర్వాత లాయర్‌ను సంప్రదించిన పిదప వారు 4 నెలల సమయం పడుతుందన్నారు. అదీగాక మొత్తం కోర్టులో అర్జీ పెట్టిన పిదప నాలుగు వాయిదాల ద్వారా వస్తుందన్నారు. ఒక్కసారిగా తక్కువ వ్యవధిలో రావడానికి సలహా చెప్పవలసిందిగా కోరుతున్నాము.

– ఎం.నాగేంద్ర బాబు, విజయవాడ.

మీకు వయసు ఎంతో చెప్పలేదు. మీకు డబ్బులు వచ్చే సమయం నాలుగు నెలలే అంటున్నారు. అది చాలా తక్కువ సమయమనే చెప్పాలి. మీకు గల అవసరాలు వివరిస్తూ కోర్టులో పిటిషన్ వేసి కోర్టు దృష్టికి సమ్మతమనిపించే అవసరాలు, ఇబ్బందులు, నిజంగా మీకు ఉన్నాయనుకుంటే తప్పకుండా ఒకేసారి వస్తాయి. అలాంటి అవసరాలు మీరు చూపించగలగాలి. లేదంటే మాత్రం మీరు ఒకేసారి పొందలేరు.

స్నేహితుడని ఆదుకుంటే...

నేను రైల్వే ఉద్యోగిని. నాతో పని చేసే వ్యక్తికి (ఉద్యోగి) ఆపద వచ్చి నాకు తెలిసిన సేటు దగ్గరకు వెళ్ళి అప్పు తీసుకున్నాము. సేటు అతనికి పరిచయం లేక నాతో ప్రాంసరి నోటు రాయించుకొని రు.30,000లు ఇచ్చాడు. నేను అతనితో అతని భార్య సంతకాలతో ప్రాంసరి నోటు రాయించుకొని రు.30,000 అతని భార్యకు ఇచ్చాను. ఇచ్చి ఇప్పటికి 24 నెలలు గడిచినా అప్పు ఇవ్వలేదు. ఇచ్చిన సేటు, నన్ను అసలు, వడ్డీ కలిపి కట్టమంటున్నాడు. నేను అతనిని అడిగితే ఇప్పుడు లేవు అంటున్నాడు. నేను అతనిపై కోర్టులో కేసు వేయవచ్చా. కేసు వేస్తే ఎంతకాలం పడుతుంది. దయచేసి నా సమస్యకు పరిష్కారం చూపగలరని మనవి.

– వెంకటయ్య, రైల్వేకాలని, లాలాగూడ.

మీరు మీ మిత్రుడి భార్యతో మరియు మిత్రునితో ప్రామిసరీ నోటు రాయించుకున్నారు కాబట్టి కోర్టులో కేసు వేయవచ్చు. కేసు మీరు 36 నెలలలోపే వేయాలి. 24 నెలలు గతించినవి కాబట్టి లాయర్ నోటీసు ఇచ్చి కేసు వేసి వడ్డీతో సహా రాబట్టుకోవచ్చు.

– గుండ్లపల్లి లక్ష్మీనరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :
న్యాయసలహాలు
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం.1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20



అరిసెలు

కావలసిన వస్తువులు:

బియ్యం	: 1 కిలో
బెల్లం	: 800 గ్రాములు
నూనె లేక నెయ్యి	: అర కిలో
నువ్వులు	: 100 గ్రాములు

చేసే విధానం: బియ్యాన్ని రెండు రోజులు నానబెట్టాలి. ప్రతి పూటా బియ్యంలో నీళ్ళు మార్చి కొత్త నీళ్ళు పోస్తూ ఉండాలి. రెండవ రోజు సాయంత్రం బియ్యాన్ని పిండి కొట్టుకోవాలి. పిండిని రెండు సార్లు జల్లిస్తే అరిసెలు బాగుంటాయి. తరువాత బెల్లాన్ని మెత్తగా దంచి అడుగు మందం ఉన్న గిన్నెలో వేసి ఓ కప్పు నీళ్ళుపోసి పొయ్యి మీద పెట్టాలి. బెల్లం కరిగి పాకం అయ్యేటప్పుడు కలుపుతూ ఉండాలి. ఇప్పుడు ఒక ప్లేటులో కొంచెం నీళ్ళు పోసి పాకం కొంచెం అందులో వెయ్యాలి. దానిని ఉండలా చుడితే గట్టిగా తగిలినప్పుడు లేదా దానిని ప్లేటుకు కొడితే టంగున మోత వచ్చినప్పుడు కిందకు దించాలి. వేయించి ఉంచుకున్న నువ్వులను అందులో పోయాలి. నువ్వులకు బదులు ఓ 50 గ్రాములు గసగసాలైనా వేసుకోవచ్చు. ఇప్పుడు బియ్యం పిండిని కొంచెం కొంచెంగా పోస్తూ ఉండలు కట్టకుండా కలపాలి. ఆ పిండిని చిన్నచిన్న ఉండలుగా చేసి అరిసెలు చేయాలి. అవి కాలిన తరువాత అరిసెల గరిటెలతో నెయ్యి లేదా నూనె పోయేట్లుగా ఒత్తి వాటిని పక్కన ఆరబెట్టాలి. వేడి వాటిని అన్నీ కుప్పగా వేస్తే అంటుకుపోతాయి. అవి ఆరిన తరువాత గాలిచొరని డబ్బాలో భద్రపరుచుకోవాలి.

బూందీ

కావలసిన వస్తువులు:

శనగపిండి	: అర కిలో
వేరుశనగ గింజలు	: పావు కిలో
కారం	: తగినంత
ఉప్పు	: తగినంత
కరివేపాకు	: రెండు కట్టలు
నూనె	: అరకిలో

చేసే విధానం: శనగపిండిని జారుగా కలుపుకోవాలి. బాండీలో నూనె పోసి కాగిన తరువాత బూందీ గరిటెతో బూందీ దూయాలి. మధ్య మధ్యలో బూందీలో కారం, ఉప్పు, కరివేపాకును కొంచెం కొంచెం కలుపుతూ ఉండాలి. బూందీ దూయడం అయిన తరువాత ఆ వేడి నూనెలోనే వేరుశనగ పప్పులను వేయించి తీసి బూందీలో కలపాలి.





ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించేది
రైతాంగ సమస్యలకు పరిష్కారం చూపించేది

మన రైతువాణి మాసపత్రిక

సంవత్సర చందా
రూ. 100/-
చందాదారులు కండి.
2004 మన రైతువాణి డైరీ, క్యాలెండర్ ఉచితంగా పొందండి.

వ్యవసాయరంగ సంక్షోభానికి, రైతు నష్టాలకు కారణాలను విశ్లేషించి పరిష్కారాన్ని చూపేది
మన రైతువాణి

సంవత్సర చందాదారులకు మాత్రమే ఈ అవకాశం.

చందా మొత్తాన్ని మీకు దగ్గరలోని రైతు సంఘం ప్రతినిధులకు గాని, రైతు సంఘం కార్యాలయాలలోగాని చెల్లించండి.
పోస్టుద్వారా పొందగోరువారు రూ. 136 లు పంపాలి.

మా చిరునామా

మన రైతువాణి, 1-1-9/10, జవహర్‌నగర్, ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్, హైదరాబాద్ - 500 020

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రచురిస్తున్న రైతుల పత్రిక